బుధవారం 10.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 49 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


'జగన్ అండ్ కో'కు మంత్రి నారా లోకేష్ అంటే భయం. అందుకే ఆయనను టార్గెట్‌గా చేసుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. డీఎస్సీ విషయంలో వైసీపీ విషప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టారు. వైసీపీ తాను తీసిన గోతిలో తానే పడింది.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



# స్టీల్ ప్లాంట్ బాధితులకు జీవితాంతం అండ

- స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం
- పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోం
- మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తాం
- స్టీల్ ప్లాంట్ ప్రాసెస్ లో ఎక్కడా లోపం లేదు
- స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై కమిటీ నివేదిక తర్వాత చర్యలు
- విశాఖ ఉక్కుకు స్లర్రీ పైప్ లైన్ తీసుకువచ్చే బాధ్యత ప్రభుత్వానిది
- విశాఖ విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు శాశ్వతంగా అండగా నిలబడతామని, పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోం అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రూ. 15వేల కోట్ల ప్యాకేజీతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. తిరిగి ఉత్పత్తి కూడా ప్రారంభించాం. ఇలాంటి పరిస్థితుల్లో స్టీల్ ప్లాంట్ లో సోమవారం జరిగిన ప్రమాదం చాలా బాధాకరం. బెస్ట్ టెక్నాలజీ ఉన్న ప్లాంట్ ఇది. ప్రమాదం జరిగిన వెంటనే కలెక్టర్, సీపీ, హోంమంత్రి, స్థానిక ఎంపీ, పల్లా గారు వచ్చారు. సోమవారం రాత్రి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి గారు స్వయంగా వచ్చి పరిస్థితులను సమీక్షించారు. కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కూడా వచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధికి ఇది నిదర్శనం.

**ఈ రాత్రికే ముందుగా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం :** నేను కేవలం చెక్ ఇవ్వడానికి రాలేదు. బాధిత కుటుంబాలకు శాశ్వతంగా అండగా నిలబడేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ముందడుగు వేసింది. పర్మినెంట్ అయినా, కాంట్రాక్ట్ అయినా మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి పెద్దమనసుతో హామీ ఇచ్చారు. గతంలో ఈవిధంగా ఎక్కడా జరగలేదు. అవసరమైతే దీనిని కేబినెట్ కు కూడా తీసుకెళ్తానని ఆయన చెప్పారు. తనదీ బాధ్యత అని చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా నిలబడాల్సిన బాధ్యత మాపై ఉంది. స్టీల్ ప్లాంట్ రూల్స్ ప్రకారం కొంతమందికి ఎక్కువ ఎక్స్ గ్రేషియా అందుతుంది. ఎంతుంటే అంత ఇవ్వాలి. ఇప్పటికే సీఎండీ చాలా స్పష్టంగా చెప్పారు. కుమార స్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు మొదటి విడత కింద మృతి చెందిన 8 కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందజేస్తాం. దానితర్వాత రావాల్సిన ఎక్స్ గ్రేషియా, పీఎఫ్ నగదు, స్టీల్ ప్లాంట్ నుంచి రావాల్సింది కూడా మొత్తం కాలిక్యులేట్ చేసి ఆయా కుటుంబాల అకౌంట్ లో వేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అంత్యక్రియల అనంతరం అందరం మరోసారి చర్చించి ఏం చేయాలో ఆలోచన చేస్తాం. బాధిత కుటుంబాల పిల్లలు సొంత కాళ్లపై నిలబడేలా చేయాల్సిన బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వంపై ఉంది.

**స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై కమిటీ నివేదిక తర్వాత చర్యలు :** గతంలో విశాఖ ఉక్కును ఎన్డీఏ ప్రభుత్వం ఏవిధంగా కలిసికట్టుగా కాపాడిందో అదేవిధంగా కార్మికుల కుటుంబాలకు మేం అండగా నిలబడతాం. ప్రమాదంపై ఇప్పటికే కమిటీని నియమించారు.

మిగతా 2లో...

# సేవలన్నీ ఒక క్లిక్ దూరంలో




**ప్రభుత్వ సేవల వినియోగానికి ప్రత్యేక యాప్**

- గ్రామీణ అన్న క్యాంటీన్లలోనూ పట్టణ స్థాయి సేవలు
- ప్రతిరోజూ తాగునీటి శాంపిల్ల పరీక్షలకు సీఎం ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ ఆన్ లైన్ లో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని.. దీంతో పాటు ప్రత్యేకంగా ఓ యాప్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రభుత్వం అందించే అన్ని సేవలను ఆన్ లైన్ చేశాం. మన మిత్ర వాట్సాప్ ద్వారా ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇదే సందర్భంలో ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా యాప్ రూపొందించాలి. రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లను పూర్తి స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలి.

మిగతా 2లో...



# ఆర్థిక పురోగతిపై నెలనెలా సమీక్ష

**ఆర్థిక వృద్ధి విశ్లేషణకు ప్రత్యేక నివేదికలు**

- ప్రాజెక్టులతో 3.5 రెట్లు ఆర్థిక కార్యకలాపాల లక్ష్యం
- పన్ను వసూళ్లు, రెవెన్యూ పెంపునకు ఏఐ టాస్క్‌ఫోర్స్ : సీఎం

2 లో

## పట్టణాలకు భారీ మౌలిక వసతుల ప్రణాళిక

- తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల అభివృద్ధికి ప్రాధాన్యం
- డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు రూ.29 వేల కోట్లు
- మున్సిపాలిటీల్లో ప్రజాధనం వృథా కాకూడదు: మంత్రి నారాయణ

2 లో

# విశాఖకు జాతీయ పర్యాటక మహాసదస్సు



- 2026 సెప్టెంబరులో 41వ ఐఏటీఓ వార్షిక సదస్సు
- ఏపీ పర్యాటక అథారిటీ-ఐఏటీఓ మధ్య అవగాహన ఒప్పందం
- రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు: మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురానున్న కీలక పరిణామం చోటుచేసుకుంది.

మిగతా 2లో...

# ఏపీ ఈజ్ బ్యాక్!



- రెండేళ్లలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు
- 800 కంపెనీల ఆసక్తి.. 23 లక్షల ఉద్యోగాలకు మార్గం
- 68 శాతం ఎంఓయూలు ఇప్పటికే ప్రాసెస్‌లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రం శరవేగంగా మారుతోంది. రెండేళ్లల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి సీఎం చంద్రబాబు పారిశ్రామిక విధానంలో తన స్టైల్ మార్చారు. గతానికి భిన్నంగా వెళ్లడం మొదలు పెట్టారు. 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అవలంభించింది. ఆ స్పీడుతోనే నాడు కొన్ని కీలక పెట్టుబడులు తెచ్చింది. కియా కార్ల కంపెనీని తెచ్చి ఉమ్మడి అనంతపురం జిల్లా.. ప్రత్యేకించి పెనుకొండ ప్రాంతం రూపు రేఖలు మార్చింది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. దీంట్లో భాగంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి.. భారీ స్థాయిలో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 800 కంపెనీలు ఏపీలో

మిగతా 2లో...

# వికసిత్ భారత్‌కు మోదీ విజన్



- సమర్థ నాయకత్వంతో దేశ గతిని మార్చిన ప్రధాని
- అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలతో ప్రజల విశ్వాసం
- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్న దేశం
- ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసలు


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానిగా నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనా ప్రస్థానం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశంలో పలు రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ప్రధానిగా ఎన్నికైన వారిలో అత్యధిక కాలం పదవిలో కొనసాగిన నేతగా ప్రధాని మోదీ రికార్డు సాధించడం దేశ ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. 2014 మే 26న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ, బుధవారం నాటికి 4,399 రోజులు ప్రధానిగా పూర్తి చేసుకోనున్నారని తెలిపారు.

2014 ఎన్నికలకు ముందు దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సమర్థ నాయకత్వం కోసం మోదీని ఎన్నుకున్నారని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో మూడుసార్లు ప్రధానిగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

మిగతా 2లో...

# స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై మోడీ దిగ్భ్రాంతి..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ప్రమాద ఘటనలో మరణించిన 9 మంది కుటుంబాలకు తన సానుభూతిని ప్రకటించారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ.. ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. స్టీల్ ప్లాంట్ లో ఉక్కుద్రవం పడి సజీవ సమాధి అయిన 9 మంది కుటుంబాలకు ప్రధాని ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నవారికి రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్ పాలనలో అవినీతి.. మోదీ హయాంలో అభివృద్ధి

- ప్రధానిగా మోదీ 4399 రోజులు పూర్తి చేయడం చారిత్రాత్మక ఘట్టం
- 81 కోట్ల మందికి ఉచిత ఆహారం.. కోట్లాది మందికి జన్‌ధన్ ఖాతాలు
- డిజిటల్ విప్లవం నుంచి మౌలిక వసతుల వరకు భారత్‌లో భారీ మార్పులు
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగవంతం
- మోదీ-చంద్రబాబు-పవన్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

2 లో..



# 36 ఏళ్లలో ఎప్పుడూ లేని విషాదం

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు.. ఒకరికి ఉద్యోగం
- క్షతగాత్రులకు రూ.10 లక్షల సాయం
- స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై త్రిసభ్య కమిటీతో దర్యాప్తు : పవన్ కళ్యాణ్

2 లో



విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తెలిపారు.

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున

# స్టీల్ ప్లాంట్ బాధితులకు జీవితాంతం అండ



(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుద్రవం పొంగడం కాకుండా పైనుంచి కక్కడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. దీనిపై క్షుణ్ణంగా పరిశీలన జరుగుతుంది. కమిటీ నివేదిక తర్వాత ఏం చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ రోజు క్షతగాత్రుల్లో ఒకరైన శ్రీనివాసరావును కలిశాను. విశాఖ ఉక్కును కాపాడాలని చెప్పారు.

**స్టీల్ ప్లాంట్ లో ప్రాసెస్ లో ఎక్కడా లోపం లేదు :** స్టీల్ ప్లాంట్ లో తక్కువ మంది కార్మికులు ఉండటం వల్ల ఈ ప్రమాదం జరగలేదు. ప్రాసెసింగ్ లో ఎలాంటి పొరపాటు, తేడాలు లేవు. లాడిల్ భారీ శబ్దంతో ఒక్కసారి పేలిపోయింది, కక్కింది. ఇది ఎందుకు జరిగిందో తెలియదు. స్టీల్ ప్లాంట్ లో వినియోగించే రష్యన్ టెక్నాలజీ బెస్ట్ టెక్నాలజీనే. కమిటీ నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం.

**విశాఖ ఉక్కుకు స్లర్రీ పైప్ లైన్ తీసుకువచ్చే బాధ్యత ప్రభుత్వానిది :** విశాఖ ఉక్కుకు కూడా స్లర్రీ పైప్ లైన్ వేయాలి. దీనిపై ఏనాడు ఏ కార్మిక సంఘం నాయకులు మాట్లాడలేదు. విశాఖ ఉక్కుకు స్లర్రీ పైప్ లైన్ కూడా తీసుకువచ్చే బాధ్యత ప్రభుత్వానిది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నాం. కార్మికులను చూసుకునే బాధ్యత నాది. పరిహారం అందించి చేతులు దులుపుకుని పోవాలని కార్మిక నేతలు మాట్లాడుతున్నారు. ఇది సరికాదు. ఎక్స్ గ్రేషియా ఇస్తాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. అసలు మీరు ప్యాకేజీ ఇవ్వకుంటే ప్లాంట్ తెరుచుకునేదికాదని, ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని మాట్లాడుతున్నారు. ప్రజలు కూడా ఆలోచించాలి. వారు అడిగిన ఎక్స్ గ్రేషియా కంటే రెగ్యులర్ ఉద్యోగులకు ఇంకా ఎక్కువ వస్తుంది.

**మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తాం :** పర్మినెంట్ అయినా, కాంట్రాక్ట్ అయినా మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తాం. ఇదీ ఎన్డీయే చిత్తశుద్ధి. ఎల్జీ పాలిమర్స్ బాధితులకు మేం వచ్చిన తర్వాత న్యాయం చేశాం.

**బాధిత కుటుంబాలకు పరామర్శ:** అంతకుముందు విశాఖ కేజీహెచ్ కు వచ్చిన మంత్రి నారా లోకేష్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం సెవెన్ హిల్స్, కిమ్స్ ఆసుపత్రిలో స్టీల్ ప్లాంట్ ప్రమాద క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. అనంతరం స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. కార్మికులతో మాట్లాడి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రి లోకేష్ తో పాటు కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి సంధ్యారాణి, ఎంపీ శ్రీ భరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, చింతకాయల విజయ్ బాధితులను పరామర్శించారు.

# విశాఖకు జాతీయ పర్యాటక మహాసదస్సు



(మొదటి పేజీ తరువాయి)

2026 సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు విశాఖపట్నంలో 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీఓ) వార్షిక సదస్సు నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అథారిటీ (ఏపీటీఏ), ఐఏటీఓ మధ్య మంగళవారం రాజమహేంద్రవరంలో అవగాహన ఒప్పందం కుదిరింది.

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో ఏపీటీఏ సీఈవో ఎ.ఎ.ఎల్. పద్మావతి, ఐఏటీఓ జాతీయ అధ్యక్షుడు రవి గోసేన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యున్నత పర్యాటక పరిశ్రమ సంస్థ నిర్వహించే సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని బీచ్‌లు, బౌద్ధక్షేత్రాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, ఎకో టూరిజం ప్రాంతాలు, హిల్ స్టేషన్లు, అడ్వెంచర్ టూరిజం అవకాశాలను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఈ సదస్సు చక్కని వేదికగా నిలుస్తుందని చెప్పారు.

**వెయ్యి మందికి పైగా ప్రతినిధులు :** సదస్సుకు దేశవ్యాప్తంగా 1,000 మందికిపైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. టూర్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, ట్రావెల్ ప్రొఫెషనల్స్, పర్యాటక పారిశ్రామికవేత్తలు, మీడియా ప్రతినిధులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొంటారు. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో బిజినెస్ సెషన్లు, పర్యాటక ప్రదర్శనలు, బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలు, డెస్టినేషన్ ప్రజెంటేషన్లు, పరిశ్రమ చర్చలు, ఫ్యామిలియరైజేషన్ టూర్లు నిర్వహించనున్నారు.

**స్థానిక భాగస్వాములకు ప్రత్యేక రాయితీలు :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటక భాగస్వాముల కోసం ఐఏటీఓ ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. సదస్సు నమోదు రుసుమును 50 శాతం తగ్గించి రూ. 6,000 ప్లస్ జీఎస్టీకి బదులుగా రూ. 3,000 ప్లస్ జీఎస్టీగా నిర్ణయించింది.

అలాగే కొత్తగా ఐఏటీఓ సభ్యత్వం పొందే రాష్ట్ర పర్యాటక భాగస్వాములకు రూ. 10 వేల జాయినింగ్ ఫీజును 2026 డిసెంబరు 31 వరకు పూర్తిగా మినహాయించింది.

**పర్యాటక రంగానికి కొత్త అవకాశాలు :** ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, ట్రావెల్ సంస్థలు జాతీయ స్థాయి నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అవకాశం లభించనుంది. కొత్త వ్యాపార ఒప్పందాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరింత ప్రాచుర్యం లభించనుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతకుముందు ఐఏటీఓ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించింది. ఈ సదస్సును రాష్ట్ర పర్యాటక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించినట్లు మంత్రి తెలిపారు.

# ఏపీ ఈజ్ బ్యాక్!



(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని కనబరిచాయి. ప్రస్తుతం రెండేళ్ల కాలంలో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి కనబరిస్తే.. వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. వీటిల్లో రూ. 21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వివిధ ఎంఓయూల ద్వారానే వస్తున్నాయి. 2025 ఏడాదిలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలతో పాటు... వివిధ వేదికల మీద.. వివిధ సందర్భాల్లో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ కలిపి మొత్తంగా రూ. 21.64 లక్షల కోట్లుగా ఉంటే.. వీటి ద్వారా 21.20 లక్షల ఉద్యోగాలు రానున్నాయి.

**రికార్డు స్థాయిలో పెట్టుబడులు... పర్ఫెక్ట్ మానిటరింగ్ :** "ఆంధ్రప్రదేశ్ ఈజ్ బ్యాక్" అనే నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం వైపు చూడటానికే భయపడి, పెట్టుబడులు వెనక్కి తీసుకుని పారిపోయిన కంపెనీలు... నేడు ఏపీ వైపు క్యూ కడుతున్నాయి. ఎంఓయూలు కుదుర్చుకోవడం.. ఆ తర్వాత వాటిని పక్కన పెట్టేయడమనేది గతంలో జరిగిన వ్యవహారం. ఆ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంఓయూల విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కుదుర్చుకున్న ఎంఓయూలను నిరంతరం మానిటర్ చేసేందుకు ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా... కుదిరిన ప్రతి ఒప్పందాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, కంపెనీలు క్షేత్రస్థాయిలోకి వచ్చేలా ప్రభుత్వం చేస్తున్న 'ఛేజింగ్' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అంటే ఏమిటో ఏపీ దేశానికి కళ్లకు కట్టినట్టు చూపిస్తోంది. ఫలితంగానే దేశానికి వచ్చిన ఖీణ×ల్లో 25.3 శాతం ఖీ-ణ×లు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చాయి. పెట్టుబడుల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అధికారులకు ప్రత్యేకంగా అప్పగించింది. కేవలం అధికారులుగా కుర్చీలకే పరిమితం కాకుండా... ప్రభుత్వం తరపున మార్కెటింగ్ మేనేజర్లుగా మారి పారిశ్రామికవేత్తల వెంట పడాలి.. వారి సమస్యలను పరిష్కరించి పరిశ్రమలు స్థాపించేలా చూడాలని సీఎం చంద్రబాబు నిరంతరం అధికారులకు నిర్దేశిస్తూ ఉంటారు. ఎంఓయూల అమలుకు మూడు రీజియన్లకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించారు. ఎంఓయూల విషయంలో దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా నిరంతరం ఛేజింగ్ చేస్తుండడం వల్లే వల్లే అతి తక్కువ కాలంలోనే కంపెనీలు సాకారమవుతున్నాయి.

**36 రోజుల్లోనే 'ఆమ్కా'.. గూగుల్ కోసం నిబంధనల మార్పు :** పెట్టుబడులు, పరిశ్రమలను గ్రౌండ్ చేసే విషయంలో ప్రభుత్వ వేగానికి, పట్టుదలకూ ఆవీజూ ప్రాజెక్టే నిలువెత్తు నిదర్శనం. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో అడుగుపెట్టి పనులు ప్రారంభించింది. ఆమ్కా విషయంలోనే కాదు.. ఇదే వేగంతో... కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ, ప్రత్యేక ఫోకస్ పెట్టడం ద్వారా దిగ్గజ సంస్థలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయి. ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం కోసం ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చర్చించి.. అవసరమైన మేరకు నిబంధనల్లోనే కీలక మార్పులు చేసేందుకు అంగీకరించేలా కేంద్రాన్ని ఒప్పించారు. అలాగే ఆర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా స్లర్రీ పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని సీఎం చంద్రబాబు ఒప్పించగలిగారు. ఈ విధంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. తద్వారా ఏపీకి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు.. కంపెనీలు ఎస్టాబ్లిష్ చేసేందుకు మార్గాన్ని కల్పిస్తోంది. ఏపీకి పొరుగునున్న రాష్ట్రాలను కాదని ఏపీకి కంపెనీలు క్యూ కట్టడం ఆయా రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో పెట్టుబడుల విషయంలో నాయుడు గిరీ అంటూ జాతీయ పత్రికల్లో వచ్చిన కథనాలు ఆయా రాష్ట్రాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ తమిళనాడును కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో తమిళనాడులో జరిగిన చర్చే దీనికి నిదర్శనం.

**ఎంఓయూల సాకారమిలా :** గతంలో లక్షల కోట్ల ఎంఓయూలు అంటూ ప్రచారం జరిగి.. క్షేత్రస్థాయిలో రూపాయి పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రూ. 21.64 లక్షల కోట్ల మొత్తం ప్రతిపాదిత పెట్టుబడుల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోంది. ఇప్పటికే ప్రాసెస్ లోకి వచ్చిన ఎంఓయూలు 68.02 శాతంగా ఉన్నాయి... డీపీఆర్ సబ్మిషన్ నుంచి గ్రౌండింగ్ దశ వరకు చేరిన ఎంఓయూలు 60.44 శాతంగా ఉంటే... భూ కేటాయింపులు దశను పూర్తి చేసుకున్న ఎంఓయూలు 21.39 శాతంగా ఉన్నాయి. మొత్తం పెట్టుబడుల్లో అతి తక్కువ కాలంలో మిగిలిన 68 శాతానికి పైగా పెట్టుబడులు ఇప్పటికే ప్రాసెస్ లోకి కీలక పరిణామంగా చెప్పవచ్చు. పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీలు రూపొందిస్తూ ముందుకు వెళ్తుండడంతో ఏపీపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పెరిగింది. అధికారుల్లో జవాబుదారీతనం కూడా పెరగడంతో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల్లో "ఏపీ ఈజ్ బ్యాక్" అనే చర్చ ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ యువతకు లక్షలాది ఉద్యోగాలు రావడం ఖాయమనే అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# 36 ఏళ్లలో ఎప్పుడూ లేని విషాదం

(మొదటి పేజీ తరువాయి)

పరిహారం అందిస్తామని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామని వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున తక్షణ సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులను మొత్తం ప్లాంట్ యాజమాన్యమే భరిస్తుందని చెప్పారు.

శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ. 45.75 లక్షలు అందించనున్నట్లు తెలిపారు.

ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు బొకారో స్టీల్ ప్లాంట్‌కు చెందిన త్రిసభ్య కమిటీ దర్యాప్తు చేపడుతుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**భద్రతా లోపాలపై లోతైన విచారణ :** స్టీల్ ప్లాంట్ చరిత్రలో గత 36 ఏళ్లలో ఇలాంటి భారీ ప్రమాదం జరగలేదని పవన్ కళ్యాణ్ తెలిపారు. ద్రవ ఉక్కును తరలించే ల్యాడిల్ బకెట్ ఈ స్థాయిలో పేలిపోవడం ఇదే మొదటిసారని నిపుణులు చెబుతున్నారని పేర్కొన్నారు.

ప్రమాద ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ల్యాడిల్ బకెట్ పేలడానికి సాంకేతిక లోపమా? ఇతర కారణాలా? అనే అంశాలను నిపుణుల కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు.

ఘటన స్థలంలో కార్మికులతో మాట్లాడానని, భద్రతా ప్రమాణాలపై వారు పలు అంశాలను తెలియజేశారని పవన్ కళ్యాణ్ అన్నారు. పాత పరికరాల వినియోగం, నిర్వహణ లోపాలు వంటి అంశాలపై కూడా పరిశీలన జరగాల్సి ఉందన్నారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం :** ప్రమాదంలో మరణించిన ఉద్యోగుల పిల్లల చదువులు కొనసాగించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలు ప్రస్తుతం ఉంటున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే ఉద్యోగి పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు కొనసాగవచ్చని చెప్పారు. టౌన్‌షిప్ బయట అద్దె ఇళ్లలో ఉంటున్న బాధిత కుటుంబాలు కోరితే వారికి కూడా క్వార్టర్లు కేటాయిస్తామని తెలిపారు.

**కార్మిక సంఘాలతో ప్రత్యేక సమావేశం :** స్టీల్ ప్లాంట్‌లోని కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకేతిక అంశాలపై త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తానని పవన్ కళ్యాణ్ తెలిపారు.

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలన్నది ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. ప్లాంట్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కేంద్రంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం పవన్ కళ్యాణ్ విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిని సందర్శించి ప్రమాదంలో గాయపడిన కార్మికులు పైడిరాజు, సూరిబాబు, శ్రీనివాస్‌లను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# వికసిత్ భారత్‌కు మోదీ విజన్



(మొదటి పేజీ తరువాయి)

గత పన్నెండేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలిగించే పలు పథకాలు అమలయ్యాయని, డిజిటల్ రంగంలో భారత్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు.

యూపీఐ వంటి సాంకేతిక మార్పుల ద్వారా కోట్లాది లావాదేవీలు సులభంగా జరుగుతున్నాయని, జనధన్ ఖాతాలు, ప్రత్యక్ష నగదు బదిలీ, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పన్నుల సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చాయని తెలిపారు.

ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ వంటి నిర్ణయాలు దేశ చరిత్రలో కీలకమైనవని పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలోనూ ప్రధాని మోదీ నాయకత్వం పటిష్ట చర్యలు తీసుకుందని అన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రధాని మోదీ నాయకత్వం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో అవినీతి.. మోదీ హయాంలో అభివృద్ధి




**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రధానిగా మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రత, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. దేశక్షేమం కోసం ఆపరేషన్ సిందూర్ వంటి కీలక నిర్ణయాలను ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు.

గతంలో దేశంలో సుస్థిర ప్రభుత్వం అందించేది కాంగ్రెస్ మాత్రమే అన్న అభిప్రాయం ఉండేదని, అయితే నేడు ప్రజల విశ్వాసంతో బలమైన నాయకత్వం కొనసాగుతోందని ప్రహ్లాద్ జోషి అన్నారు. కాంగ్రెస్ పాలనలో భారీ అవినీతి, స్కామ్‌లు చోటుచేసుకున్నాయని ఆరోపించిన ఆయన, మోదీ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, అభివృద్ధికి ప్రాధాన్యత లభిస్తోందని చెప్పారు.

భారత్ ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి వివరించారు. నైపుణ్యం, స్థాయి, సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడే దిశగా ముందుకు సాగారని, 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ జరుగుతోందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. జన్‌ధన్ ఖాతాల ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు చేరాయని, డిజిటల్ లావాదేవీల్లో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఆహార సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం ఏపీలో జియో ట్యాగింగ్ పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల అభివృద్ధిలో దేశం ముందుకు సాగుతోందని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. లక్షల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణంతో ఉపాధి అవకాశాలు పెరిగాయని, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోందని చెప్పారు. సౌర విద్యుత్ రంగంలో భారత్ వేగంగా దూసుకెళ్తోందని అన్నారు.

ఎన్డీయే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కూటమి నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా పనిచేస్తోందని, రాష్ట్రానికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందుతోందని అన్నారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై సంతాపం :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తాయని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు చెప్పారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారని, ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. ప్రధానమంత్రి ప్రమాద బీమా పథకం కింద మృతుల కుటుంబాలకు రూ. 2.5 లక్షల ఆర్థిక సాయం అందుతుందని వెల్లడించారు.

విశాఖ ఘటన నేపథ్యంలో తిరుపతిలో నిర్వహించాల్సిన కూటమి విజయోత్సవ సభను వాయిదా వేసినట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెరిగి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతమిస్తున్నదని పేర్కొన్నారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో రాష్ట్రం మరింత ముందుకు వెళ్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీజేపీ సీనియర్ నేత భానుప్రకాష్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చందోలు ఎస్ ఐ మాధవరావు

**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు గ్రామంలో చందోలు ఎస్సై కే. మాధవరావు ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా కాలి నడకన గస్తీ నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ప్రాణరక్షక కవచమని వివరించారు. అలాగే మహిళలపై జరిగే నేరాల నివారణకు సంబంధించి చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించే విధానంపై అవగాహన కల్పించారు. గంజాయి సేవనం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ మరియు సామాజిక జీవితంపై పడే ప్రభావాలను వివరించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని యువతకు సూచించారు.

అదేవిధంగా గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై మాధవరావు విజ్ఞప్తి చేశారు.

# పట్టణాలకు భారీ మౌలిక వసతుల ప్రణాళిక



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :: రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రానున్న మూడేళ్లలో తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, వాడుక నీటి నిర్వహణ, అంతర్గత రహదారులు, వీధిదీపాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

అమరావతిలో హడ్కో ఆధ్వర్యంలో నిర్వహించిన 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్' వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ. 17,394 కోట్ల అంచనాతో ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. అమృత్-1.0, అమృత్-2.0 తదితర పథకాల కింద ఇప్పటికే రూ. 12,395 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కచ్చా డ్రైన్లను శాశ్వత డ్రైన్లుగా మార్చేందుకు దాదాపు రూ. 29 వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. తొలి దశలో అధిక, మధ్యస్థ జనసాంద్రత ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను రూ. 9 వేల కోట్లతో చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రాష్ట్రానికి రూ. 3,600 కోట్లు రానున్నాయని, రాష్ట్ర వాటాతో కలిపి భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 72 మున్సిపాలిటీలకు బ్యాంకుల నుంచి నిధులు సమీకరించే సామర్థ్యం ఉందని చెప్పారు.

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు లోనై అవసరం లేకుండా మంచి రోడ్లు, డ్రైన్లను తొలగించి కొత్త పనులు చేపట్టవద్దని ఇంజినీర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నిజంగా అవసరమైన ప్రాంతాల్లోనే పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్లలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు.

హడ్కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కులశ్రేష్ఠ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో రాష్ట్రం ముందంజలో ఉందని ప్రశంసించారు.

పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి బ్యాంకబుల్ ప్రాజెక్టుల రూపకల్పన అత్యంత అవసరమని చెప్పారు. మున్సిపాలిటీలను ప్రైవేటీకరిస్తున్నారన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు.

వర్క్‌షాప్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పి. సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సేవలన్నీ ఒక క్లిక్ దూరంలో



(మొదటి పేజీ తరువాయి)

అర్బన్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల సేవలను ఏ విధంగా అందిస్తున్నారో... రూరల్ ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లల్లోనూ అదే స్థాయిలో సేవలు అందించాలి. ప్రజలకు అందే తాగునీటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీటి కాలుష్యం అనేది ఉండకూడదు. తాగునీటిలో ఎలాంటి మలినాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ తాగునీటి శాంపిళ్లు తీయాలి. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపొద్దు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రజల్లో అవగాహన వస్తేనే క్లీన్ అండ్ గ్రీన్ తరహా కార్యక్రమాలను విజయవంతం చేయగలం. ప్రకృతి పట్ల, పరిసరాల శుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి. జలధార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమం ఫలితాలు కన్పించాలి. చెరువులను సిద్ధం చేసుకోవాలి. వర్షాకాలంలో చెరువులన్నీ నిండేలా చూడాలి. వర్షపు నీటిని ఒడిసి పట్టాలి. ప్రతి కుంటనూ, ప్రతి చెరువునూ ఆన్ లైన్లో పెట్టేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించేలా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించుకునేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దీని కోసం టెక్నాలజీని వినియోగించాలి. ఈ మేరకు అనంతపురం జిల్లాలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును పరిశీలించాలి. గంజాయిని అరికట్టేందుకు మూలాల్లోకి వెళ్లాలి. గంజాయి సాగు, రవాణ, అమ్మకం, వినియోగం అనేది ఎక్కడా కన్పించకూడదు. మహిళలపై నేరాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలి... వివిధ నేరాలకు పాల్పడితే ఎలాంటి శిక్షలు పడతాయి... శిక్షలు పడిన వారికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలి. మహిళలపై నేరాలు చేయాలంటే భయపడేలా ప్రచారం చేపట్టాలి. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలి. పరిపాలనలో నూతన విధానాల అమలుపై కేంద్రం ఆసక్తి చూపిస్తోంది. సుపరిపాలన లో భాగంగా రాష్ట్రంలో కొత్త విధానాలను ప్రవేశపెట్టాం. అధికారులు, ఉద్యోగులకు పనితీరును మెరుగు పరిచేలా ఓరియేంటేషన్ ఇస్తున్నాం. టెక్నాలజీని వినియోగించుకుని పరిపాలనలో కొత్త పద్ధతులను అమలు చేస్తున్నాం. టెక్నాలజీ డ్రివెన్ నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఆర్టీజీఎస్, అవేర్ వంటి వ్యవస్థలతో పరిపాలనలో కొత్త విధానాలను ఎస్టాబ్లిష్ చేస్తున్నాం. కేంద్రం ఈ తరహా పద్ధతులను అమలు చేసేందుకు ఆసక్తిగా ఉంది. వీటిని ఢిల్లీలో జరగబోయే నీతి ఆయోగ్ సమావేశంలో ప్రజెంట్ చేద్దాం." అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్షలో మంత్రి కొలుసు పార్ధసారధి, సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు : సానా సతీష్



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) : సొంత తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి మహిళల గౌరవం గురించి మాట్లాడటం అత్యంత హాస్యాస్పదమని, ఆయనకు ఆ నైతిక హక్కు లేదని టీడీపీ రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ తీవ్రంగా విమర్శించారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 11 మందికి రాజ్యసభ సభ్యత్వాలు ఇచ్చినా, కనీసం ఒక్క మహిళకైనా అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. మహిళల పట్ల నిజమైన గౌరవం ఉంటే అప్పుడే చూపించాల్సిందని అన్నారు.

పదవులు పంచేటప్పుడు మహిళలను పట్టించుకోని జగన్, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం మహిళల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. "అప్పుడు మహిళలు గుర్తుకు రాని జగన్‌కు, ఇప్పుడు మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతికత ఎక్కడిది?" అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ ప్రకటించినప్పటి నుంచి జగన్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారని సతీష్ పేర్కొన్నారు. మహిళా ఓటు బ్యాంకును ఆకట్టుకునేందుకు అబద్ధపు ప్రచారాలకు తెరలేపారని ఆరోపించారు.

సొంత తల్లిని విశాఖలో రాజకీయంగా ఓడించడం, చెల్లిని రాజీనామా చేయించడం వంటి ఘటనలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కుటుంబ సభ్యులకే గౌరవం ఇవ్వలేని వ్యక్తి రాష్ట్ర మహిళల గురించి మాట్లాడటం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. మహిళల సాధికారత, భద్రత, ఆర్థిక అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని సానా సతీష్ స్పష్టం చేశారు.

## జూన్ 18, 19 తేదీల్లో ప్రజా రంగ సంస్థల కమిటీ సమీక్ష సమావేశాలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రజా రంగ సంస్థల కమిటీ సమావేశాలు ఈ నెల 18, 19 తేదీల్లో అమరావతిలోని శాసనసభ కార్యాలయ కమిటీ హాల్-1లో నిర్వహించనున్నట్లు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు.

ఈ సమావేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల స్థాపన లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితులు, ఆస్తులు--అప్పులు, కార్యకలాపాలు, పనితీరు, సిబ్బంది వివరాలు, ఖాళీలు, రోస్టర్ అమలు వంటి అంశాలపై కమిటీ సమగ్రంగా సమీక్ష చేయనుంది.

అలాగే ప్రభుత్వ విధానాల అమలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ, ఖాతాల నిర్వహణ, ఆడిట్ అభ్యంతరాల పరిష్కారం, స్వయంప్రతిపత్తి, సామర్థ్య పెంపు చర్యలు, CSR నిధుల వినియోగం, ఈ-ఆఫీస్ అమలు వంటి అంశాలను కూడా పరిశీలించనున్నారు.

జూన్ 18న ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశంలో వ్యవసాయం, పట్టు పరిశ్రమ, సహకార రంగం, రైతు సంక్షేమం, పశుసంవర్ధక, మత్స్య, వెటర్నరీ, సామాజిక సంక్షేమ రంగాలకు చెందిన సంస్థలపై సమీక్ష జరగనుంది. ఇందులో ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ, SERIFED, రైతు సాధికార సంస్థ, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఏపీ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్, ఏపీ వెటర్నరీ కౌన్సిల్ తదితర సంస్థలు పాల్గొంటాయి.

జూన్ 19న జరిగే సమావేశంలో వెనుకబడిన తరగతుల కమిషన్, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ, రాజుగ్రా, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తదితర సంస్థల కార్యకలాపాలు, ఆర్థిక, పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

# ఆర్థిక పురోగతిపై నెలనెలా సమీక్ష



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర స్థూల ఉత్పత్తి, రాష్ట్రంలోని ఆర్థిక వృద్ధిని విశ్లేషించేందుకు నెల వారీ నివేదికల్ని రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర- క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా నిర్దేశిత తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. నెల, త్రైమాసికం, అర్ధ సంవత్సరంలో నమోదయ్యే వివిధ గణాంకాల ద్వారా ఎప్పటికప్పుడు జీఎస్డీపీ లక్ష్యాన్ని సమీక్షించు కునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లను సాధించే అంశంపై సీఎం దిశానిర్దేశం చేశారు. జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలపై చేసే వ్యయంపై 3.5 రెట్ల మేర ఆర్థిక కార్యకలాపాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని రియల్ టైమ్ లో ఈ ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఓ ఏఐ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని సీఎం నిర్దేశించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్సుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ ను పెంచేందుకు శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. తయారీ, గనులు, వాణిజ్యం,రవాణా తదితర రంగాలతో పాటు అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఆర్థిక వ్యవస్థకు మల్టిప్లైయర్ ఎఫెక్ట్ వచ్చేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. అధికారులు, ఉద్యోగుల సామర్థ్యాల పెంపుపై జూలై 2-3 తేదీల్లో రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహించాలని సీఎం సూచించారు. జీఎస్టీ సహా పన్ను వసూళ్లపై పూర్తి సాంకేతికతను వినియోగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# 5 లక్షలకు చేరిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

- **వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో...రోజురోజుకి పెరుగుతోన్న ఔత్సాహికులు**



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :యోగాంధ్ర-2026 రిజిస్ట్రేషన్లు ఐదు లక్షలకు చేరుకున్నాయి. ఈ నెల 7 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా 3 రోజుల వ్యవధిలోనే ఐదు లక్షలకు చేరుకోవడం విశేషం. తొలిరోజు 25వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. సోమవారం నుంచి ఈ సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. యోగాసనాల్లో కోటి మందిని భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు జారీచేసిన ఆదేశాలు అనుసరించి యోగాంధ్ర పోర్టల్ ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం కనిపిస్తోన్న సానుకూల వాతావరణం ప్రకారం త్వరలోనే కోటి మంది పేర్లు యోగాంధ్ర పోర్టల్ లో నమోదు కాబోతున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా గుంటూరు జిల్లాలో 98వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత నెల్లూరు, నంద్యాల, కర్నూలు, పల్నాడు జిల్లాలో ఎక్కువ మంది పేర్లు నమోదయ్యాయని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ నేడు ఒక ప్రకటనలో వెల్లడించారు. యోగా అసోసియేషన్ల ద్వారా, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా, ఇతర మద్దతుల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

**లక్ష్యానికి మించి యోగా మాస్టర్ ట్రైనర్ల పేర్లు నమోదు!**

యోగాంధ్ర కార్యక్రమానికి యోగా మాస్టర్ ట్రైనర్లలో 5,600 మంది పేర్లు నమోదు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సంఖ్య ఇప్పటికే 6,939కు చేరుకోవడం గమనార్హం. వైఎస్సార్ కడప జిల్లాలో 412, అనకాపల్లి-379, అనంతపురం-342, కర్నూలు జిల్లాలో 310 మంది యోగా మాస్టర్ ట్రైనర్ల పేర్లు యోగాంధ్ర పోర్టల్ లో నమోదయ్యాయి. వాస్తవానికి ప్రతి జిల్లాకు 200 మంది చొప్పున పేర్లు నమోదుచేయించాలని ప్రభుత్వం జిల్లాలకు సూచించింది. మరోవైపు యోగా ట్రైనర్ల కేటగిరిలో 2.5 లక్షల మందిని చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే 1.88 లక్షల మంది పేర్లు యోగాంధ్ర పోర్టల్ లో నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 9,013 మంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. ప్రభుత్వం ఖరారుచేసిన ప్రణాళికలు అనుసరించి జిల్లాల్లో యోగాసనాల కార్యక్రమాలు, థీమ్ బేస్డ్, రకరకాల పోటీలు, ఇతర కార్యక్రమాలు యధావిధిగా జరుగుతున్నాయి.

## 1న అమరావతిలో జరిగే 'యోగాంధ్ర'కు బాబా రాందేవ్ హాజరు!

- **రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి యోగాంధ్ర-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పతంజలి రాందేవ్ బాబాను ఆహ్వానించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే 25వేల మందిని గ్రూపులుగా విభజించి రాందేవ్ బృందానికి చెందిన వారితోపాటు వివిధ యోగా అసోసియేషన్ల ప్రతినిధులు ఆసనాలు వేయిస్తారని చెప్పారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అనుసరించి యోగా అండ్ నేచురోపతి ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, ఆయుష్ అధికారులు మర్యాదపూర్వకంగా 'హరిద్వార్' వెళ్లి బాబా రాందేవ్ ను నేరుగా ఆహ్వానించబోతున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, జిల్లాల వారీగా పురోగతి, ఇతర అంశాలపై ఉన్నతాధికారుల తో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాందేవ్ శిక్షణ పొందుతున్న వారిలో కొందరు విద్యార్థులు ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. వీరు కూడా యోగాసనాలు చేస్తారని చెప్పారు. రాందేవ్ రాకతో యోగాకు మరింత ప్రాచుర్యం పెరుగుతుందని, యోగాంధ్ర ఖ్యాతిని పెంచుతుందని వెల్లడించారు.

**విజయవాడకు వచ్చిన రాందేవ్ ప్రతినిధులు!**

యోగాంధ్ర కార్యక్రమానికి రాందేవ్ హాజరవుతుండడంతో సన్నాహక ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయన ప్రతినిధుల బృందం విజయవాడకు చేరుకుంది. ఈ బృందం మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొంది. రాష 'వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి వీరపాండియన్, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ యోగాంధ్ర -2026 కింద రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి రాందేవ్ బృందానికి వివరించారు. యోగాంధ్ర-2026 కింద చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకశీగా ఉన్నాయని రాందేవ్ బృందం కొనియాడింది

**నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదింపులు!**

ఈ నెల 21న జరిగే రాష్ట్రస్థాయి యోగ యోగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు (కృష్ణా నదిపై) విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ హైవే అథా రిటీ ఆఫ్ ఇండియా అధికారులతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, బ్రిడ్జి సామర్థ్యం, ఇత ర అంశాలపై వారి మధ్య చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు హైకెపాసిటీ ఆడియో, వీడియోల ఏర్పాటు, మీడియా స్టేషన్లు, బ్యారికేడ్స్ వంటి ఏర్పాట్లు జాతీయ రహదారిపై జరుగుతున్నాయి.

## విశ్వ జనని జిల్లెల్ల మూడి అమ్మ పేరుతో మొక్కలు నాటిన బీజేపీ నేతలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశ్వ జనని జిల్లెల్ల మూడి అమ్మ పేరుతో బీజేపీ రాష్ట్ర నేతలు మొక్కలు నాటారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.

గుంటూరు నగరంలోని రంగనాయక స్వామి దేవస్థానం వద్ద బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి, జిల్లెల్ల మూడి అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ జిల్లెల్ల మూడి అమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని, భావితరాల కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలని పిలుపునిచ్చారు.

మొక్కలు నాటడం ద్వారా భూమి వేడిని తగ్గించడంతో పాటు ప్రకృతి సమతుల్యత, వర్షాలు, సహజ వనరుల పరిరక్షణకు సహకారం అందుతుందని తెలిపారు. యువత పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లెల్ల మూడి అమ్మకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. నేటి యువత అమ్మ జీవితం, సేవలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లెల్ల మూడి అమ్మ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి పిలుపు మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వేలాది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, మండల అధ్యక్షుడు పక్కలగడ్డ తిరుమలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా నేతలు నారాయణరెడ్డి, మంత్రి సుగుణ, పెమ్మరాజు సుధాకర్, చేగు నాగేశ్వరరావు, రమాదేవి, రమేష్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శారద సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు!

తెనాలి( జర్నలిస్ట్ ఫైల్ ):క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి మహిళ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శారద పేర్కొన్నారు. మండల గ్రామమైన కొలకలూరు లో డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ముందస్తుగా క్యాన్సర్ వ్యాధిని నియంత్రిం చెందేందుకు ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారద మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా అనేక ప్రాంతాలలో శారద సొసైటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అనేక మందికి ఆపరేషన్ చేయించడం జరిగిందని ఆమె తెలియజేశారు. 15 సంవత్సరాల దాటిన ఆడ పిల్లలు తప్పనిసరిగా క్యాన్సర్ను నియంత్రించే వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శారదా సర్వీసెస్ సొసైటీ నిర్వాహ కులు సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కడప వేదికగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్-2026 సందడి




- **ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగే రెండవ దశ మ్యాచ్**
- **రాయలసీమ అభిమానుల్లో పెరుగుతున్న ఉత్సాహం**

కడప (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ఐదో సీజన్ క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇప్పటివరకు విశాఖపట్నం కేంద్రంగా సాగిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో రెండో దశ మ్యాచ్‌లకు ఈసారి కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. జూన్ 17 నుంచి 21 వరకు జరిగే మ్యాచ్‌లకు రాయలసీమ ప్రాంతం ఆతిథ్యం ఇవ్వనుంది.

దేశీయ క్రికెట్‌లో గుర్తింపు పొందిన ఆటగాళ్లతో పాటు ఐపీఎల్‌లో మెరిసిన క్రికెటర్లు కూడా పాల్గొంటుండటంతో ఈ టోర్నీపై భారీ ఆసక్తి నెలకొంది. హనుమ విహారి, కేఎస్ భరత్, రికీ భుయ్ వంటి ప్రముఖ ఆటగాళ్ల ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం అభిమానులకు దక్కనుంది.

ఏడు జట్ల మధ్య మొత్తం 32 మ్యాచ్‌లతో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో కడపలో తొమ్మిది లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జూన్ 17న జయవాడ సన్ షైనర్స్, డిఫెండింగ్ ఛాంపియన్స్ తుంగభద్ర వారియర్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో కడప దశ ప్రారంభం కానుంది.

ఈ సీజన్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమతో పాటు సింహాద్రి విశాఖ లయన్స్, కాపిటల్ అమరావతి రాయల్స్, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్ షైనర్స్, భీమవరం బుల్స్, కాకినాడ కింగ్స్ జట్లు బరిలోకి దిగుతున్నాయి. యువ ఆటగాళ్లు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ టోర్నీని కీలక వేదికగా భావిస్తున్నారు.

కడప స్టేడియంలో డే-నైట్ మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పూర్తి చేస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పిచ్, అవుట్‌ఫీల్డ్‌ను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

యువతలో క్రికెట్‌పై ఆసక్తిని పెంచే లక్ష్యంతో పాఠశాల, కళాశాల విద్యార్థులకు మ్యాచ్‌లకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. స్థానిక అకాడమీలకు చెందిన విద్యార్థులు, యువ క్రికెటర్లు ప్రముఖ ఆటగాళ్లను ప్రత్యక్షంగా చూసి ప్రేరణ పొందే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని యువ ప్రతిభను వెలికితీసి, భవిష్యత్‌లో ఉన్నత స్థాయి క్రికెట్ వేదికలకు తీసుకెళ్లడమే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రాయలసీమలో క్రికెట్ అభివృద్ధికి ఈ టోర్నీ మరింత ఊతమిస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## గోదావరి ప్రక్షాళనకు కేంద్రం నుంచి రూ.400 కోట్ల నిధులు



- **ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

రాజమండ్రి (జర్నలిస్ట్ ఫైల్) : గోదావరి ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఏడాదికి రూ.400 కోట్ల చొప్పున నిధులు కేటాయించిందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని, గోదావరి పుష్కరాల నేపథ్యంలో 290 గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మునికూడలిలో ఘాట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

దేశ అభివృద్ధిలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం స్ఫూర్తిదాయకమని సోము వీర్రాజు అన్నారు. అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన సందర్భంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో మోదీ పేరుతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గోదావరి కాలుష్య నివారణపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించిన తీరు అభినందనీయమని పేర్కొన్న ఆయన, గోదావరిని కాలుష్యం నుంచి కాపాడేందుకు ఆంధ్రా పేపర్ మిల్, రాజమండ్రి నగరపాలక సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పవన్ ఆదేశించారని తెలిపారు. గోదావరి పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు కీలకమని అన్నారు.

## యోగాంధ్ర విజయవంతానికి సమన్వయంతో ముందుకు సాగాలి




- **యోగాంధ్ర వార్ రూమ్‌లో సమీక్ష.. యోగా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చలు**

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర' కార్యక్రమాల అమలుపై మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగా వార్ రూమ్‌లో మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో యోగా కార్యక్రమాల విస్తరణ, ప్రజల భాగస్వామ్యం పెంపు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు.

ఈ సందర్భంగా రాందేవ్ ప్రతినిధులతో అధికారులు సమావేశమై యోగా ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గం ప్రజలను యోగాతో అనుసంధానం చేయడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున యోగా శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వీరపాండియన్, రోణంకి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డీఏపీ అధిక ధరలకు విక్రయం.. డీలర్ లైసెన్స్ సస్పెండ్

**-నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**
**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎరువులను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హెచ్చరించారు. భైంసా పట్టణంలో డీఏపీ ఎరువులను నిర్ణీత ధర కంటే ఎక్కువకు విక్రయించిన ఘటనపై వ్యవసాయ శాఖ అధికారుల నివేదిక ఆధారంగా సంబంధిత డీలర్ లైసెన్సును సస్పెండ్ చేసినట్లు ఆయన సోమవారం వెల్లడించారు. వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించామని చెప్పారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన మరో నలుగురు ఎరువుల డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి తాఖీదులు ఇచ్చినట్లు వెల్లడించారు. రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించడం, నకిలీ విత్తనాల విక్రయం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు జరపడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాలు, విత్తన విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయించినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు



సమాచారం ఇవ్వాలని సూచించారురైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఎరువులు, విత్తనాల సరఫరాలో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు

## భూనిర్వాసిత జేపీఏ ఉద్యోగుల సీనియారిటీని యథావిధిగా కొనసాగించాలి

**కడప జిల్లా, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (RTPP) భూనిర్వాసిత కోటాలో 2013వ సంవత్సరంలో నియమి




తులైన జేపీఏ (JPA) ఉద్యోగుల సీనియారిటీ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ భూనిర్వాసిత ఉద్యోగులు ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్ వాసుదేవ రావు సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లను చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లారు. 2013లో నియమితులైన జేపీఏ ఉద్యోగులకు సంబంధించి, గతంలో 2016 మరియు 2022 సంవత్సరాల్లో ఆర్టీపీపీ సిఇ కార్యాలయం వారు ఇచ్చిన సీనియారిటీ జాబితాని వన్ టైం బేసిస్ భూ నిర్వాసితుల ప్రాధాన్యత కోటా కింద యథావిధిగా కొనసాగించాలి. కొత్త డ్రాఫ్ట్ జాబితా రద్దు: గత జూన్ 2, 2026 (02.06.2026) న చీఫ్ ఇంజనీర్ ఆర్టీపీపీ కార్యాలయం వారు విడుదల చేసిన కొత్త డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితాని తక్షణమే రద్దు చేయాలి. కొత్త నోటిఫికేషన్ విడుదల: ఆర్టీపీపీ నందలి జేపీఏ ఉద్యోగాల ఖాళీలకు వెంటనే కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలి. ఆ ఖాళీలను కేవలం భూ నిర్వాసితులతోనే భర్తీ చేసి స్థానిక బాధితులకు పూర్తి న్యాయం చేయాలి. తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, భూనిర్వాసిత ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉద్యోగులు చీఫ్ ఇంజనీర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ భూనిర్వాసిత ఉద్యోగులు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్త గువ్వల వెంకటరమణ మృతి నివాళులు అర్పించిన వైసీపీ నాయకులు



**-తనకల్లు మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి**

**తనకల్లు, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** తనకల్లులోని బూడిద గడ్డ వీధి వైఎస్ఆర్సిపి కార్యకర్త గువ్వల వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు వీరితోపాటు రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ దేశాయి భక్తవత్సల రెడ్డి, దేశాయి సంజీవరెడ్డి, మహిళా విభాగ అధ్యక్షురాలు విజయ లక్ష్మి, సూర్యనారాయణ బిఎస్ నిజాం, దుగునే పల్లి భయ రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నివాళులర్పించారు

## వీ ఎల్ టీ డి రద్దు చేయాలి-న్యూ ఆంధ్ర ఆంధ్ర మోటార్ అసోసియేషన్ ఎర్రగుంట్ల

**కడప జిల్లా, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు



చేస్తున్న వీ ల్ టీ డి విధానాన్ని రద్దు చేయాలని న్యూ ఆంధ్ర మోటర్ ట్రాన్స్పోర్టర్స్ అసోసియేషన్ కడప, అన్నమయ్య ఇన్చార్జులు గంగిరెడ్డి, మధు రెడ్డిలు తెలిపారు. ఎర్రగుంట్ల లోని కడప రోడ్డులో న్యూ ఆంధ్ర మోటార్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషగిరి ఆదేశాల మేరకు కడప అన్న మయ్య జిల్లాల సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప అన్నమయ్య జిల్లాల అసోసియేషన్ ఇన్చార్జిలు గంగిరెడ్డి మధు రెడ్డి మాట్లాడుతూ కేవలం ప్రజా రవాణాకు సంబంధించిన వాహనాలకు మాత్రమే ఈ డివైడ్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అన్ని వాహనాలకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెరిగిన డీజిల్ ధరలు, టోల్ ఫీజులు, వాహనాల స్పేర్ పార్ట్స్ తో ట్రాన్స్పోర్ట్ లో యజమానులు ఇబ్బందులు పడుతున్నారని వీ ల్ టీ డి విధానం వల్ల మరింత ఆర్థిక భారం పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు ఆర్థిక భారంతో బలహీనమవుతున్న ట్రాన్స్పోర్ట్ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు ఈ విధానం అమలుపై ట్రాన్స్పోర్ట్ సంఘాలతో చర్చలు జరిపి వారి అభిప్రాయాన్ని పరిగణంలోకి తీసుకోవాలని తెలిపారు చిన్న లారీల యజమానులకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించాలని వారు కోరారు. ఈ విధానంపై చట్టపరమైన స్పష్టత వచ్చేవరకు శిక్షాత్మక నిర్ణయాలను ఇవ్వాలని వారు కోరడం జరిగింది. ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించి వాహనదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ యజమానులు సురేంద్ర రెడ్డి కార్తీక్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి వెంకట సుబ్బారెడ్డి సాంబశివారెడ్డి శివ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అప్పాయిగూడెం జీపీలో గ్రామసభ



**-సర్పంచ్ దండు ప్రవీణ్**

**సింగరేణి, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణిమండలం ,అప్పాయిగూడెం గ్రామ పంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం అప్పాయిగూడెం రైతు వేదిక లో ప్రత్యేక గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ నరేందర్, ఇరిగేషన్, ఏఈ నాగి రెడ్డి , ఇరిగేషన్ ఇన్స్పెక్టర్, అగ్రికల్చర్ ఏవో బట్టు అశోక్ కుమార్, ఏఈ ఓ మున్నీ, ఐకె పి ఓపియం వెంకటేశ్వర్లు, సీ.సీ డాక్టర్ హిమ బిందు, హెల్త్ డిపార్ట్మెంట్, అంగన్వాడీ టీచర్స్, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## నూతన మొబైల్ షాప్ ప్రారంభించిన సర్పంచ్ కావేరి





**నార్నూర్, జూన్ 09 :** నార్నూర్ నార్నూర్ మండల కేంద్రంలో భోప్పపూర్ గ్రామానికి చెందిన తిబోతే విశ్వకిరణ్ నెలకొల్పిన నూతన మొబైల్ షాప్ ను సర్పంచ్ బానోత్ కావేరి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమాని కి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సురేష్ ఆడే, దళిత రత్న కొర్రల మహేందర్, కనక ప్రభాకర్, బీసీ సంఘం నాయకులు గుంజ చిన్నయ తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు" అనే కార్యక్రమం నిర్వహించారు





**కడప జిల్లా, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జమ్మలమడుగు పట్టణంలోని సాయి శివాణి కల్యాణమండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడింది. మీజ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన "కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు" అనే కార్యక్రమంలో భాగంగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరియు చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిన మోసాలను, హామీల ఉల్లంఘనలను ప్రత్యేక రాజుణ స్క్రీన్ల ద్వారా కార్యకర్తలకు, ప్రజలకు విపులంగా వివరించారు. ముఖ్య నేతల ప్రసంగాలు: సమావేశాన్ని ఉద్దేశించి మీజ రామసుబ్బారెడ్డి మరియు నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదని, ప్రజలను తీవ్రంగా వంచించిందని ధ్వజమెత్తారు. ఈ మోసాలపై ప్రజల్లో చైతన్యం తేవడానికి పార్టీ శ్రేణులన్నీ కదలాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న నిరసన ర్యాలీ: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12వ తేదీ శుక్రవారం నాడు జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన ర్యాలీని చేపట్టనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని వైఎస్ఆర్సీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు, ప్రజలు మరియు జగనన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనాలని వారు కోరారు

### మున్సిపల్ కార్యాలయ ఆవరణలో

## పరిశుద్ధంపై అవగాహన కార్యక్రమం



మంథని, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని మున్సిపాలిటీ పరిధిలోని 10, 11, 12, 13వ వార్డుల వార్డు సభను సోమవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త మరియు ప్రత్యేక జాగ్రత్త చెత్తలను వేర్వేరుగా వర్గీకరించి మున్సిపల్ సానిటేషన్ సిబ్బందికి అందజేయాలని అవగాహన కల్పించారు. అలాగే ఇంకుడు గుంతల నిర్మాణం, భవిష్యత్తు తరాల కోసం సురక్షితమైన పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, త్రాగునీటి సంరక్షణ, రోడ్లు మరియు వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వారి నుంచి వినతిపత్రాలు మరియు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కుర్ర లింగయ్య , వేముల లక్ష్మి , తహశీల్దార్ శ్రీ అరిఫొద్దిన్ , ఎంఎల్‌హెచ్‌పి శ్రీమతి శ్రీవాణి , మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బోనకల్ ఎస్ఐ పొదిలి వెంకన్న బదిలీ

### బోనకల్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మాచినేని రవి




రాథోడ్, బోనకల్, జూన్ 09 : బోనకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ పొదిల వెంకన్న బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా మాచినేని రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.గత కొంతకాలంగా బోనకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన పొదిల వెంకన్న తన సేవల ద్వారా ప్రజలకు చేరువై, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. ఆయన బదిలీ నేపథ్యంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు.ఇదిలా ఉండగా, నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మాచినేని రవి సోమవారం బోనకల్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, చట్టపరమైన సేవలను సమర్థవంతంగా అందిస్తానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని, ప్రతి ఒక్కరూ పోలీసు శాఖతో సమన్వయం కలిగి ఉండాలని కోరారు.నూతన ఎస్ఐకి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## కేశంపేటలో బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలి

### ఎస్సై రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు




జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) కేశంపేట మండల కేంద్రంలో గల్లీకి ఒక బెల్ట్ షాపు ఉన్నట్లు ఆరోపిస్తూ, వాటి కారణంగా గ్రామంలో సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారుజామునే మద్యం సేవించే వారి సంఖ్య పెరగడంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వెంటనే అక్రమ బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్సై రాజ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బైరమోని బాలరాజ్, బొజ్జం శ్రీశైలం, గంజాయి దశరథం, తలసాని పవన్ కుమార్ రెడ్డి, పోలేమని సతీష్, బైకని శేఖర్, రాజు, రాజేందర్ రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేసిన కార్యదర్శికి గ్రామస్తుల ఘన సత్కారం

### సేవలకు గుర్తింపుగా శాలువాతో సన్మానించిన గ్రామస్తులు



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : కేశంపేట మండలంలోని మంగళగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఆరు సంవత్సరాలు తొమ్మిది నెలల పాటు సేవలందించిన శ్రీనివాసులు బదిలీ కావడంతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలులో ఆయన చేసిన సేవలను కొనియాడారు. గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఆర్టీ కల్చర్ రాజేష్, గ్రామ సర్పంచ్ కొంటం నరేందర్ రెడ్డి, ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మహిళా సమాఖ్య ఎంపిఓ జానకి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు. శ్రీనివాసులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## మంగళగూడలో ప్రత్యేక గ్రామసభ..

### పరిశుభ్రతపై ప్రజలకు దిశానిర్దేశంచెత్తను వేరు చేయండి..

### గ్రామాన్ని కాపాడండి: అధికారుల పిలుపు



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కేశంపేట మండలంలోని మంగళగూడ గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్--2026, వర్షాకాల సన్నద్ధత, మంచినీటి నిర్వహణ, జల సంరక్షణ, హరితహారం ప్లాంటేషన్, రైతుల రిజిస్ట్రేషన్ మరియు ఎస్ఐఆర్ అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కొత్తగా అమలులోకి వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక వ్యర్థాలుగా నాలుగు బుట్టల్లో వేరు చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని వివరించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఆర్టీ కల్చర్ రాజేష్, గ్రామ సర్పంచ్ కొంటం నరేందర్ రెడ్డి, ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి యాదగిరి, హెల్త్ డిపార్ట్‌మెంట్ శివానంద్, వార్డు సభ్యులు, మహిళా సమైక్య సీపీ జానకి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**– గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**– ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అపోహలను వీడి ప్రజలు సహకరించాలి**

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. సంపూర్ణ లక్ష్యం**

**– కూసుమంచి మండలం ఈశ్వరమాధారం గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, కూసుమంచి, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలనీ, వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాతావరణ సమతుల్యత ను కాపాడాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.సోమవారం పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం ఈశ్వరమాధారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు, రసాయన ఎరువుల వాడకం తగ్గించి నానో యూరియాను ప్రోత్సహించాలని, పరిసరాల పరిశుభ్రత, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, వన మహోత్సవం, జల సంరక్షణ, ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితర అంశాలపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామస్థులకు ఎస్.ఐ.ఆర్ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, బీ.ఎల్.వో లు కొత్త ఓటర్ల ను నమోదు చేస్తారని, గతంలో గ్రామాల్లో నివాసం ఉండి, ఇప్పుడు వేరే ఊర్లకు వెళ్లిన వారు,మరణించిన ఓటర్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25 నుంచి ఇండ్ల వద్దకు బి.ఎల్.వో లు వచ్చి ఫారాలు ఇస్తారని, వాటిలో మన పూర్తి వివరాలను రాసి, సరైన ధృవ పత్రాలు ప్రభుత్వం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జతచేసి సమర్పించాలని సూచించారు. బీ ఎల్ వోలకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ.ఆర్.వో స్థాయిలో కొత్త ఓటరు జాబితాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రచురిస్తారని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియ చేయాలని కలెక్టర్ సూచించారు. 2002 లో ఉన్న మన ఓటరు సంఖ్య ను అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కొనసాగుతుందని, పెండింగ్ లో ఉన్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ కూడా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ లో భాగంగా ఇంతవరకు తడి,పొడి చెత్త నిర్వహణతో పాటు శానిటరీ, మెడికల్ వెస్ట్ చెత్తతో సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. చెత్త సేకరణ విషయంలో గ్రామ సర్పంచి, కార్యదర్శి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇండ్లలో పోగయ్యే చెత్తను నిల్వ చేసేలా గ్రామస్థులకు తెలియజేయాలని చెప్పారు. అలాగే ఉపాధి హామీ పథకం లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, ప్రతీ రోజు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, రోజు మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని, సీజనల్ వ్యాధులు, జ్వరాలు, డెంగీ, మలేరియా ప్రభల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్ రెడ్డి, కూసుమంచి



# మల్టీ టాలెంటెడ్ ఆర్టిస్ట్ శ్రీలత

### గానం, వ్యాఖ్యానం,సంగీతం,నటన,బోధనలలో రాణింపు



ఖమ్మం కల్చరల్, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్): కళారంగంలో ఒక ప్రక్రియలో రాణించడమే గగనం.అలాంటిది పలు ప్రక్రియలలో రాణిస్తూ కితాబులందుకోవడం విశేషమే. అరుదైన బహుముఖ ప్రజ్ఞతో గుర్తింపు పొందారు ఖమ్మం నగరానికి చెందిన పుసులూరి శ్రీలత.చిన్నతనంనుంచే సంగీతంపై మక్కువ వుండడంతో శాస్త్రీయ సంగీతంలో ప్రాథమిక పాఠాలు గురువుల పర్యవేక్షణలో ఆమె నేర్చుకున్నారు. ఆ పునాది ఆమె గాత్రానికి చక్కని పట్టును, రాగయుక్తంగా పాడగలిగే నైపుణ్యాన్ని సంతరించి పెట్టింది. సినిమా, భక్తిగీతాలాపనలే కాకుండా కర్ణాటక శాస్త్రీయ సంగీత కార్యక్రమాలను విరివిగా చేపట్టారు. తనకున్న శాస్త్రీయ సంగీత విద్యను పదిమందికి పంచాలన్న ఉద్దేశ్యంతో ఎంతోమందికి ఆన్లైన్ ద్వారా ఉచితంగా సంగీత శిక్షణను శిక్షణనందిస్తున్నారు.గాయని డా.సంధ్యారాణి కూడా శ్రీలత వద్దే భక్తి,దేశభక్తి,జానపద గీతాలకు సంబంధించిన లలిత సంగీతాన్ని నేర్చుకున్నట్టు ఓ సందర్భంలో పేర్కొనడం విశేషం.అదేవిధంగా సామాజిక చైతన్యం కోసం స్వచ్ఛభారత్,అక్షరాస్యత వంటి అంశాలపై షార్ట్ ఫిలింలలో నటించి నటిగా కూడా తన ప్రతిభను కనబర్చారు.యూట్యూబ్,సోషల్ మీడియాలలో ఆమె సంగీత కచేరి,నటనకు సంబంధించిన వీడియోలు దర్శనమిస్తాయి. ప్రముఖ మీడియా సంస్థ ఐ డ్రీమ్ వంటి ఛానల్లలో ఆమె ఇంటర్వ్యూలు ప్రసారమయ్యాయి. ఖమ్మంలో ఏటా జరిగే త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలలో క్లాసికల్ కచేరీలు చేస్తూ సంగీత ప్రియుల ప్రశంసలు పొందారు.ఆమె కేవలం కీర్తనలకే పరిమితం కాకుండా అన్నమయ్య,రామదాసు కీర్తనలు లలిత గీతాలను శ్రావ్యంగా ఆలపించడంలో గుర్తింపు పొందారు.సాంప్రదాయ వేదికలపైనే కాకుండా పలు ఛానల్లు,ఆధునిక డిజిటల్ ప్లాట్ ఫాంలపై శ్రీలత సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. పల్లెటూరు ఆత్మను ప్రతిబింబించే స్వచ్ఛమైన జానపద గీతాలు ఆమె గాత్రం నుంచి జాలువారుతుంటాయి.పేరడీ పాటలను డిజిటల్ రూపంలో డిజైన్ చేసి ప్రేక్షకులకు అందించారు.



### వ్యాఖ్యానంలో దిట్ట

వృత్తిరీత్యా కామారెడ్డిలో హైస్కూల్ గెజిటెడ్ హెడ్మిస్ట్రెస్ కావడంతో మాతృభాషపై పట్టు,పదజాలాభివృద్ధి సహజంగానే పుష్కలంగా లభించింది.తనకున్న భాషాజ్ఞానంతో వ్యాఖ్యాతగా కూడా ప్రేక్షకామోదం పొందారు. ఖమ్మంలో మొగిలి ఎంటర్టైన్మెంట్స్ నిర్వహించిన ఆనందలహరి,నవ్వుల దినోత్సవం,ఆకాశంలో ఒక తార వంటి భారీ కార్యక్రమాలకు శ్రీలత హోస్ట్ గా వ్యవహరించి మన్ననపొందారు.హైదరాబాద్ రవీంద్ర భారతిలో మొగిలి గుణకర్ నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవంలో యాంకర్ గా వ్యవహరించి సినీనటులు బాబూమోహన్,మల్లం రమేష్ ల మెప్పు పొందారు. పూర్వ భారత ఉప రాష్ట్రపతి వెంకర్యనాయుడు పాల్గొన్న ఒక కార్యక్రమానికి ఈమె హోస్ట్ గా వ్యవహరించడం విశేషం.పలు సాంస్కృతిక సంస్థలకు యాంకర్ గా పనిచేశారు.సినీ సంగీత కార్యక్రమాల సందర్భంలో గాయకులు పాడబోయే పాట ఏ రాగంలోనిది దాని ప్రాముఖ్యత ఏంటో శ్రోతలకు ఆమె చక్కగా వివరిస్తుంటారు .పాట రచయిత,సంగీతదర్శకుడు,తెరమీద నటించిన నటులు,సినిమా పేరు,సంవత్సరం,సన్నివేశ వివరాలు,నేపథ్యం తదితర మూలాల్లోకి వెళ్లి ప్రస్తావిస్తుంటే ప్రేక్షకులను ఆసక్తిగా ఆలోచింపజేయడం శ్రీలత వ్యాఖ్యానంలోని ప్రత్యేకత. ఆమె వేదికనెక్కే ముందు వినిపించబోయే పాటలపై పూర్తి అధ్యయనం చేస్తారు. అందుకే సక్సెస్ఫుల్ యాంకర్ గా ప్రాచుర్యం పొందారు.అంతేగాకుండా విద్యార్థుల కోసం పేరడీ పాటలను సృష్టించి తానే స్వయంగా పాడుతూ పాఠ్యాంశాలు బోధించడం ఈమెకు వెన్నతో పెట్టిన విద్య.ఉపాధ్యాయులకు బోధనా మెలుకువలను శాటిలైట్ ఛానల్,దూరదర్శన్ ద్వారా శిక్షణ అందించిన విశేష అనుభవం శ్రీలతకు వుంది.ఈమెను స్ఫూర్తిగా తీసుకొని మరెంతోమంది ఆల్ రౌండ్ నైపుణ్యం గల కళాకారులు,ఉపాధ్యాయులు వెలుగులోకి రావాలని ఆశిద్దాం

# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**– గర్భిణీలు సేవలను వినియోగించుకోవాలి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామారావు**



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల పరిధిలో ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 9 న (మంగళవారం) నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 10 సంవత్సరాల నుంచి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన, సమగ్ర గర్భధారణ వైద్య సేవలను అందించడం, తల్లి–శిశు మరణాలను తగ్గించడం, హై–రిస్క్ గర్భధారణలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

### - కార్యక్రమంలో అందించబడే సేవలు

గర్భిణీలకు సమగ్ర వైద్య పరీక్షలు, రక్తపోటు, బరువు, రక్తహీనత పరీక్షలు, రక్తం, మూత్ర పరీక్షలు మరియు ఇతర అవసరమైన ల్యాబ్ పరీక్షలు. గర్భస్థ శిశువు ఎదుగుదల అంచనా అవసరమైన వారికి అల్ట్రా సౌండ్ సేవలు.హై–రిస్క్ గర్భిణీల గుర్తింపు మరియు ప్రత్యేక పర్యవేక్షణ. ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రల పంపిణీ.ప్రసవానికి ముందు మరియు తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు అని తెలిపారు. పోషకాహారం, తల్లిపాల ప్రాముఖ్యత, కుటుంబ మద్దతుపై కౌన్సెలింగ్.

### - డీఎంహెచ్ఓ సూచనలు

గర్భిణీలు తప్పనిసరిగా తమ మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డు వెంట తీసుకురావాలి.కనీసం నాలుగు ఏ ఎన్ సి చెకప్‌లు చేయించుకోవాలి.హై–రిస్క్ గర్భిణీలు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.కుటుంబ సభ్యులు గర్భిణీలను సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి సేవలను పొందేలా సహకరించాలి.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు లలో ఈ సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.గర్భిణీ స్త్రీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సురక్షిత మాతృత్వం -- ఆరోగ్యకరమైన శిశువు లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. డి. రామారావు కోరారు.

# ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలి

**– వ్యవసాయ కార్మిక సంఘంరెండు ఫోటోల విధానం రద్దు చేసి రోజుకూలీ రూ.800 ఇవ్వాలికేశంపేటలో ఉపాధి కార్మికుల మండల సదస్సు**

కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : కేశంపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తెలంగాణ



వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కార్మికుల మండల సదస్సు నిర్వహించారు. షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు అంజయ్య, జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అమలు చేస్తున్న రెండు ఫోటోలు తీసే విధానం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిగ్నల్ సమస్యలు, యాప్ సాంకేతిక లోపాల కారణంగా కార్మికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని అన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు, వడదెబ్బ





నివారణ చర్యలు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేమార్పులను ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రోజుకూలీని రూ.800కు పెంచి, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని కోరారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీసం రూ.26 వేల వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కేశంపేట మండల కమిటీ ఎన్నికలు నిర్వహించి అధ్యక్షురాలిగా కుమ్మరి సుజాత, కార్యదర్శిగా నాగిళ్ల అంబేద్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు కార్మికులు, సంఘ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**– మంత్రి పొంగులేటికి సయ్యద్ సాదిక్ అలీ వినతి**



ఖమ్మం, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించి వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఖమ్మం జిల్లా ఏదులాపురంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2.20 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.5 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే ఆదర్శప్రాయమైన షాదీఖానా నిర్మించాలని కోరారు. అలాగే ముస్లిం సోదరుల ఖననాల కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఖబరస్తాన్‌గా కేటాయించి, రెవెన్యూ శాఖ ద్వారా హద్దులు నిర్ణయించి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్లెగూడెం ప్రాంతంలో మసీదు నిర్మాణం కోసం 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో పాటు, పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపల్ పరిధిలో జనాజా వాహనం అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వెంటనే వాహనం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఈద్గా స్థలాన్ని ఫ్లోరింగ్ చేసి ప్రార్థనలకు అనువుగా తీర్చిదిద్దాలని తెలిపారు. మైనార్టీ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి కుట్టు మిషన్లు వంటి ఉపాధి సాధనాలను పంపిణీ చేయాలని, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి అర్హులైన మైనార్టీలకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీలో వృత్తి విద్యా కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మైనార్టీల సంక్షేమం, విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఈ వినతులను సానుకూలంగా పరిశీలించాలని సయ్యద్ సాదిక్ అలీ కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు, మైనార్టీ ప్రతినిధులు, నజీరుద్దీన్ మహమ్మద్ హుస్సేన్ అల్లా బకాష్ జానీ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# విమర్శలు ప్రతి విమర్శలతో రగులుతున్న తెలుగు రాష్ట్రాలు

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : అన్యోన్యంగా కలిసిమెలిసి సోదర భావంతో నివసించే తెలుగు రాష్ట్రాల ప్రజలను కొందరు అవకాశం వాద రాజకీయ నాయకులు, ఊరు పేరు లేని తెలంగాణ వాదుల మని వాదులమని కొందరు రెచ్చగొట్టే ప్రసంగాలను చేస్తున్నారు. మరి కొందరు రాజకీయ నాయకులు తమ రాజకీయాల ప్రయోజనాల కోసం కావాలనే రెచ్చగొడుతూ వైశ్యామ్యాలను సృష్టిస్తున్నారు. ముఖ్యమంత్రి స్థాయి లో ఉన్నవారు సైతం సమస్యలను పరిష్కరించగా పోగా విమర్శించేవాన్ని సమర్థిస్తున్నారు. వారి వారి రాజకీయ వ్యక్తిగత ఏజెండాలను ప్రజలపై రుద్దాలని చూస్తున్నారు. వారు చేసిన అక్రమాలు మరచి, ఇతరుల అక్రమాలపై దాడి చేస్తున్నా రూ? విమర్శలు సహితుకంగా కాకుండా వ్యక్తిగత కుటుంబాలపై చేయడం ఎంతవరకు సబబు. అందరూ మేధావులు అని చెప్పుకునేవారు నీ జాతి నిజంగా విమర్శించడం వారి విజ్ఞత కు తగదు. స్టేజి పై ఉన్న అనుభవజ్ఞులైన మేధావులు సైతం వారికి సర్ది చెప్పి సహేతుకమైన విమర్శ చేయమని సలహాలు ఇవ్వకుండా మౌనంగా ఉండడం మేధావులు అని చెప్పుకునే వారి విజ్ఞతకు తర్కానమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రాల తెలుగు ప్రజలు సమైక్యంగా సఖ్యతతో కలిసిమెలిసి జీవిస్తుంటే ఓర్వలేని కొందరు రాజకీయ నాయకులు వారి రాజకీయ స్వప్రయోజనాల కోసం రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు రేపుతున్నారు. లౌకికవాద మేధావులు అభ్యుదయవాదులు వామపక్షవాదు లు ఈ వివాదాలకు పులిస్టాప్ పెట్టేందుకు కృషి చేయాలి.

## ఖమ్మం నగరంలో నిబంధనలకు

# విరుద్ధంగా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ స్కూల్స్

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరంలో అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలను నిర్వహిస్తున్నారు. అనేక చోట్ల ఉన్న పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ లేదు, విద్యార్థుల సంరక్షణ లేదు, మూడు నాలుగు అంతస్తు భవనంలో విద్యను బోధిస్తూ సేఫ్టీ పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే మీనా మీసాలు లెక్కిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఆ శాఖ అధికారులపై పలు అనుమానాలకు తావు ఇస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా విధానం ఒకటే అయిన ఫీజులు మాత్రం ఇష్టానురాజ్యంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. అయినా కూడా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ. కొన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుంటారు. కనీసం తల్లిదండ్రులకు సైతం గౌరవ మర్యాదలు ఇవ్వని పరిస్థితి. ఖమ్మం నగరంలో ఇటీవల కాలంలో కార్పొరేట్ సంస్థలలో ఉన్న ఫీజులను వసూళ్లు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే అవకాశం లేదు. తాము ప్రతికలకు యాడ్స్, రాజకీయ, స్టూడెంట్స్ యూనియన్ నేతలకు చందాలు ఇస్తున్నాం అని చెప్పడం కొసమెరుపు. ప్రవేట్ పాఠశాల వసూళ్లతో బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు. తల్లిదండ్రుల మేల్కోవాలి నిర్దిష్టమైన ప్రమాణాలను, నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలోనే మీ పిల్లలను చదివించాలి అని సూచిస్తున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సైతం ఎక్కువ మార్కుల వచ్చినట్లుగా ప్రచారం కొనసాగిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూళ్లపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది మరి. ఇంకా మరిన్ని వివరాలతో త్వరలో రోజు వారి సంచికలో ప్రచురితం జరుగుతుంది.

## మంత్రి తుమ్మల ఆదేశాలతో లకారం జంక్షన్ లో

# విద్యుత్ లైట్లు పాంటెన్ లతో కాంతులీనుతున్న పివి విగ్రహం




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఆరు నెలలగా పాంటెన్, కలర్ లైట్లు పనిచేయకుండా కళావిహీనంగా ఉన్న పీవి విగ్రహ సర్కిల్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కార్పొరేషన్ అధికారులు లకారం జంక్షన్ లో కొత్తగా అత్యంత ఎత్తైన పౌంటెన్లు, నూతన విద్యుత్ లైట్లు, పాడైపోయిన స్టీల్ గ్రిల్స్ స్థానంలో కొత్తగా గ్రిల్స్, గ్రీనరి ను కూడా ఏర్పాటు చేశారు.

# యువత జేబులకు చిల్లు, కోట్లు సంపాదించుకున్న ఓకే సాయి

**– ఆన్‌లైన్ మోసాలపై ఉక్కుపాదం ఎప్పుడూ..**

**– ఓకే సాయి వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధితుల డిమాండ్– సీఎం వద్ద నాకు అండదండలు ఉన్నాయి –నా మామ సిఎం వద్దా పనిచేస్తున్నాడు**



ఖమ్మం, జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) : సోషల్ మీడియా వేదికలను అడ్డాగా చేసుకుని నిరుద్యోగ యువత ఆశలను పెట్టుబడిగా మార్చుకుని లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సూర్యతండాకు చెందిన యూట్యూబర్ ఓకే సాయి అలియాస్ బానోత్ సాయినాథ్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. నాకు సీఎం వద్ద అండదండలు ఉన్నాయని అక్కడ నా మామ పని చేస్తున్నాడని బహిరంగంగా ఓకే సాయి పేర్కొంటూ కొందరు భయభ్రాంతులకు గురిచేస్తూ పబ్బం



గడుపు కోవడం షరా మామూలే. వివరాల్లోకి వెళితే.... సోమవారం ఓకే సాయి చేతిలో మోసపోయిన బాధితులు ఒకే సాయి ఇంటి ముందు నిరసన తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలువురు బాధితుల ఫిర్యాదుల మేరకు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనా, బాధితులకు న్యాయం ఎప్పుడు జరుగు తుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బాధితుల కథనం ప్రకారం, "పెట్టుబడి లేకుండా ఆదాయం", "ఇంట్లో కూర్చునే కోట్లు సంపాదన", "ట్రాప్ షిప్పింగ్‌తో జీవితమే మారిపోతుంది" వంటి ఆకర్షణీయమైన మాటలతో యువతను ఆకట్టుకుని కోర్సులు, శిక్షణ కార్యక్రమాల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే డబ్బులు చెల్లించిన తర్వాత ఆశించిన ఫలితాలు రాకపోవడంతో పలువురు ఆర్థికంగా నష్టపోయామని బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువకులు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు తమ కష్టార్జిత డబ్బును కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. సోషల్ మీడియాలో గత రెండేళ్లుగా వస్తున్న ఆరోపణలు, తాజాగా నమోదైన కేసులు, బాధితుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ వ్యవహారాన్ని కేవలం సాధారణ ఫిర్యాదుగా కాకుండా లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కేవలం కేసు నమోదు చేసి ఫైళ్లకే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా బాధితుల వివరాలను సేకరించి ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల విభాగం, ఆదాయపు పన్ను శాఖలు కూడా రంగంలోకి దిగి ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలని కోరుతున్నారు. సోషల్ మీడియాలో కోట్ల రూపాయల వ్యాపారాలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకునే వ్యక్తుల ఆదాయ వనరులు, ప్రజల నుంచి సేకరించిన నిధుల వినియోగం, బ్యాంకు లావాదేవీలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. నిరుద్యోగ యువత కలలను ఆసరాగా చేసుకుని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తు తున్నాయి. "ఆన్‌లైన్‌లో రంగురంగుల మాటలు చెప్పి డబ్బులు దోచుకునే వారిపై ఉక్కుపాదం మోపకపోతే మరిన్ని కుటుంబాలు నష్టపోయే ప్రమాదం ఉంది" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నమోదైన కేసులపై పోలీసులు పారదర్శకంగా, వేగంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ఖమ్మం తో పాటు కారేపల్లి తదతర ప్రాంతాల్లో ఉన్న జర్నలిస్టు లకు సైతం పెద్ద మొత్తంలో డబ్బును పంపిణీ చేసినట్లు ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. మరోవైపు జర్నలిస్టు లే కాక రాజకీయ, పోలీసు తో పాటు పలు శాఖల అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బును పంపిణీ చేశారనే ఆరోపణలు సైతం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

# డయేరియా, పోలియో, నులిపురుగుల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 09 (జర్నలిస్ట్ ఫైల్) : వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ భుజంగరావు అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాలను వహించడం జరిగినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ....ఐదు సంవత్సరాలు లోపు పిల్లల్లో 1) డయేరియా, నీళ్ల విరోచనాలు నిర్మూలన కార్యక్రమం. 2) పల్స్ పోలియో కార్యక్రమం. 3) జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈ మూడు కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాలను నిర్వహించినట్లు తెలియజేశారు. డయేరియా నిర్మూలన కార్యక్రమం డయేరియా నిర్మూలన కార్యక్రమం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ త్రిభుజంగారావు అధ్యక్షత వహించి ఈ విధంగా మాట్లాడారు....ఈ కార్యక్రమాన్ని జూన్ 16వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఎవరు కూడా డయేరియా లక్షణాలతో మరణించకుండా జాగ్రత్త పడాలని, అదేవిధంగా ప్రతి ఇంట్లో5 సంవత్సరాల లోపు పిల్లల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు,14 జింక్ మాత్రలు వారి ఇంట్లో ఉంచాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు డయేరియాకు గురికాకుండా వారి తల్లులకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ లను ఏర్పాటు చేయాలని, మొదటి దశలో జూన్ ఒకటో తేదీ నుండి జూన్ 15వ తేదీ వరకు కార్యక్రమ నిర్వహణకు కావలసిన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవడం జరుగుతుందన్నారు. రెండవ దశలో జూన్ 16వ తేదీ నుండి జూలై 31 వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ దశలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని, పట్టణ మురికి వాడలో, గిరిజన ప్రాంతాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే వారిలో డయేరియా మరణాలు జరగకుండా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీనికోసం గ్రామ, పట్టణ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని, పారిశుద్ధ్యము, వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత, స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. డయేరియా కేసులను ప్లాన్ ఏ, ప్లాన్ బి, ప్లాన్ సి గా విభజించి చికిత్సను అందించాలన్నారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడి టీచర్, పంచాయతీ సెక్రెటరీ సమన్వయంతో డయేరియా వ్యాధి సోకకుండా, మెప్మా మహిళా సమాఖ్య, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, సభ్యులను సమన్వయ పరుచుకుంటూ ఏరియాను నిర్మూలించాలన్నారు. డి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ....ప్రతి తల్లి చేతుల శుభ్రత పాటిస్తూ, బ్రెస్ట్ శుభ్రతను పాటించాలని, ఐదు సంవత్సరాల లోపు పిల్లల కోసం డయేరియా రాకముందే ముందు జాగ్రత్తగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లను 14 జింక్ మాత్రలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్య క్రమంపై డి ఐ ఓ డాక్టర్ అశోక్ అవగాహనను కల్పించడం జరిగింది. జాతీయ



టీకాల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా పల్స్ పోలియో కార్యక్రమశీ పై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ భుజంగరావు అధ్యక్షతన నిర్వహించినట్లు డాక్టర్ రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....రాష్ట్రంలో పల్స్ పోలియో చివరి కేసు 2014 సంవత్సరంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హౌరా పట్టణంలో నమోదైనట్లు తెలియజేశారు. అప్పటినుండి ఇప్పటివరకు భారతదేశంలో నూతనంగా పోలియో కేసు నమోదు కాలేదు అన్నారు. ఈ కార్యక్రమం ఐదు సంవత్సరాలలోపు చిన్నపిల్లలకు పోలియో చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఈనెల జూన్ 28వ తేదీ రోజు బూతు స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని, జూన్29,30వ తేదీలలో వైద్య సిబ్బంది, వాలంటీర్లు గృహ సందర్శన ద్వారా ఇంటింటికి తిరిగి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు భుజంగరావు మాట్లాడుతూ....అన్ని సహాయ సహకారాలు, సమన్వయంతో కొనసాగాలన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమశీలోజిల్లా స్థాయిలో విద్యుత్ శాఖ వారు నిరంతరం విద్యుత్తును సరఫరా చేయాలని లేకుంటే పల్స్ పోలియో చుక్కల మందు, టీకాలు పొటెన్సీ పోతుందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో ఐదు సంవత్సరాలలోపు పిల్లల జాబితాను సిద్ధం చేసి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా రీజనల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ సహకారంతో ఆరోజు అవసరమయ్యే వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. ప్రతి బూతులో నలుగురు ఉంటారని మొదటిరోజు పోలియో చుక్కల మందును బూతు వద్ద వేయడం జరుగుతుందని రెండవ రోజు మూడవ రోజు గృహ సందర్శన ద్వారా ప్రతి ఇంటిని సందర్శించే ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు బూతు స్థాయిలో తప్పిపోయిన వారికి పోలియో చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో కలిసి పోలియో కార్యక్రమాన్నిరూరల్ వాటర్ సప్లై వారు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని, డిపిఆర్ఓ వైడ్ పబ్లిసిటీ ద్వారా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. జిల్లావ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బూతులను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయించాలన్నారు. నులిపురుగులనిర్మూలన దినోత్సవం పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనలో భాగంగా ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వరకు ఆల్బెండజోళ్ళు మాత్రను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మాత్రను బాగా నమిలి చప్పరించాలని తెలియజేశారు. శరీరంలో నులిపురుగుల ద్వారా విద్యార్థులు రక్తహీనతకు గురి కావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి గ్రామస్థాయి మండల స్థాయి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ప్రతి పాఠశాలలో ఒక నోడల్ ఉపాధ్యాయులను నియమించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్ని శాఖల అధికారులను సమన్వయపరచుకుంటూ గ్రామంలో డయేరియా మరణాలు జరగకుండా, ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల మందు వేయించేలా, ఒకటి నుండి 19 సంవత్సరాల మధ్యనున్న విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రను ఇవ్వడం ద్వారా రక్తహీనత ను తొలగించి నుదుపురుగుల నిర్మూలించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నిర్మూలన పై పోస్టర్లను అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ, ప్రోగ్రాం అధికారి డి ఐ ఓ డాక్టర్ ఎం అశోక్, డీఈవో పి అశోక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ నుండి వెంకటేశ్వర్ గౌడ్, విద్యుత్తు శాఖ నుండి పివి రాజేశ్వర్, మైనార్టీ విభాగం అధికారిని కృష్ణవేణి, ఇలా ఉపవైద్యాధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ సికందర్ నాయక్, డాక్టర్ సమత ఇంకా వివిధ అనుబంధ శాఖల నుండి అధికారులు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శిఖరా, వైద్య సిబ్బంది నారాయణ, ఘన్సూర్ వెంకటేశ్వర్లు, సచిన్, తరుణ్, మనోహర్ జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశానికి హాజరు కావడం జరిగింది.



## జాకబ్ గాప్ స్కూల్ లీలలు

# పర్మిషన్ నిల్, పైసల్ వసూల్ ఫుల్లు

**– తల్లిదండ్రుల జేబులకు చిల్లు– నిద్రమత్తులో విద్యాశాఖ, ప్రశ్నించిన వారిని నోట్ల వర్షంతో నోరు మూపిస్తున్న యాజమాన్యం– స్కూల్ ప్రారంభం కాకముందే వసూళ్ల పర్వానికి తెర తీసిన ప్రిన్సిపాల్ – ఫైర్ అయితే నో సేఫ్టీ , విద్యార్థుల ప్రాణాలకు రక్షణ ఏది – అరకొర విద్యార్హతలు ఉన్న వారితోనే విద్యా బోధన**



ఖమ్మం,బొనకల్లు, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా, బోనకల్ మండల పరిధిలోని బోనకల్ ప్రధాన రహదారికి సమీపంలో గత కొంతకాలంగా నిర్వహించబడుతున్న జాకప్ గాప్ స్కూల్లో పైసల వసూళ్ల పర్వం రోజురోజుకు మితిమీరి పోతుంది. ఎటువంటి సేఫ్టీ పద్ధతులను పాటించక పోయిన కూడా ఆ స్కూల్ నిర్వహించేందుకు మండల జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఏదో గ్రామాల్లో నిరక్షరాశులయిన తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకొని కొంతమంది పిఆర్ఓ ల ద్వారా స్కూల్లో విద్యార్థులను చేర్పించుకుంటున్నారు. విద్యాబోధన విషయంలో కూడా అరొకొర అర్హతలు ఉన్న వారితో విద్యాబోధనను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఫైర్ సేఫ్టీ అసలే లేదు. మరి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ గీతాన్ని ప్రతిరోజు ప్రతిరోజు స్కూల్లో ఆలపించాలి కానీ అక్కడ ఉన్న ప్రిన్సిపాల్ మోనార్క్‌గా వ్యవహరిస్తూ ఎటువంటి నియమ నిబంధనలను పాటించకుండా ఇష్టాను రాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుకు విద్యార్థుల తల్లిదండ్రులు విసుగెత్తుతున్నారు.


## దరిపల్లి అనంత రాములు కళాశాలలో

# ఎన్సీసీ విద్యార్థులకు 'బి' సర్టిఫికెట్ల ప్రదానం

**– శ్రీరంగం వరుణ్ త్రిలోక్ విద్యార్థికి జేఎయూఓ ర్యాంక్ ప్రదానోత్సవం**




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లాలోని దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్ ( ఇంజనీరింగ్, యం.బి.ఎ) (డేర్ కాలేజ్) లో ఎన్సీసీ విద్యార్థులకు 'బి' సర్టిఫికెట్ల ప్రదానోత్సవం, వరుణ్ త్రిలోక్ విద్యార్థికి జూనియర్ అండర్ ఆఫీసర్ (జేయుఓ) ర్యాంక్ ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్సీసీ శిక్షణను 2024-25, 2025-26 లలో జాయిన్ అయి విజయవంతంగా పూర్తి చేసిన జూనియర్, సీనియర్ విద్యార్థిని విద్యార్థులు శ్రీరంగం వరుణ్ త్రిలోక్ (డిప్లొమా మైనింగ్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), దేవనూరి సుమంత్(డిప్లొమా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), జూలూరి సౌమ్య (డిప్లొమా కంప్యూటర్స్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), పెద్దొరాజు స్పందన (డిప్లొమా కంప్యూటర్స్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), షేక్ హీనా హర్షద్ (డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్), దాసరి రమ్య (డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్) లకు 'బి' సర్టిఫికెట్లను అందజేయగా, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రతిభ కనబరిచిన శ్రీరంగం వరుణ్ త్రిలోక్ ఫైనల్ ఇయర్ మైనింగ్ విద్యార్థికి జూనియర్ అండర్ ఆఫీసర్ (జేయుఓ) ర్యాంక్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి దరిపల్లి విద్యా సంస్థల అధినేత మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్సీసీ విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులను, జేఎయూఓ ర్యాంక్ పొందిన విద్యార్థిని కళాశాల యాజమాన్యం అభినందించి వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి కేర్ టేకర్ ఆఫీసర్ మహేశ్వరం చిరంజీవి, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి: నన్నపనేని రాజకుమారి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక ఐతనగర్లో బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో నన్నపనిని సీతారామయ్య, సరస్వతమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ, మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి లు హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ ప్రముఖ బుచ్చయ్య, నన్నపనేని సుశీల జ్ఞాపకార్థం గ్రామీణ ప్రాంత ప్రజల మెరుగైన ఆరోగ్య కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత శిబిరానికి వచ్చిన వారందరికీ ఎంతో విలువైన పరీక్షలను నిపుణులైన బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం ద్వారా ఉచితంగా వైద్య పరీక్ష చేసి చికిత్సను అందించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నన్నపనేని ఆంజనేయులు, శాఖమూరి నారాయణ ప్రసాద్, ఈదర పూర్ణచంద్, కాకుమాను రాంబాబు, వసంతం అశోక్ వర్ధన్, కాకుమను సత్యం, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేసిన ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** వినుకొండ పట్టణంలోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులతో శిక్షణ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి క్లస్టర్, యూనిట్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రతి నాయకుడు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పరిశీలకులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలించిన కమిషనర్ ఎం.హాసిని



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా 11 వ సచివాలయము 16 వ వార్డు భీమావారిపాలెం నందు పారిశుధ్య పనులు మరియు డ్రైనేజీ పూడిక తీత పనులను కమిషనర్ ఎం హాసిని పరిశీంచారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బాపట్ల జిల్లా కలెక్టర్ ఒ మేజిస్ట్రేట్ మరియు ప్రత్యేకాధికారి బాపట్ల పురపాలక సంఘం వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచనల తో ఆపరేషన్ క్లీన్-స్వీప్ కార్యక్రమం భీమావారిపాలెం ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య పనులు మరియు డ్రైనేజీ పూడిక తీత పనులను కమీషనర్ ఎం హాసిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ కాలువల్లో పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులను పరిశీలించి,మురుగు నీరు సజావుగా ప్రవహించేలా డి-సిల్టేషన్ పనులను వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను క్రమం తప్పకుండా నిర్వహించాలని, నీరు నిల్వ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని కమిషనర్ శానిటరీ ఇన్స్పెక్టర్ కరుణ కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

# మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- మహిళా గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో మహిళల సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు.

ఈ సందర్భంగా గుంటూరు 25వ డివిజన్ కొత్త కాలనీకి చెందిన దేవ కుమారి అనే మహిళ, తమ ఆధార్ కార్డుకు పొరపాటున ఐటీ రిటర్న్ అనుసంధానం కావడంతో "తల్లికి వందనం" పథకం కింద రావాల్సిన ఆర్థిక సాయం అందడం లేదని వివరించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

కుప్పల తిరుపతమ్మ అనే మహిళ తన భర్త రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడని, కుటుంబ పోషణ భారం మొత్తం తనపై పడిందని చెబుతూ ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బ్రాడీపేటకు చెందిన లక్ష్మమ్మ తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని వినతిపత్రం అందజేయగా, సంబంధిత అధికారులు అర్హతలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

దరియా నగర్‌కు చెందిన పలువురు మహిళలు తమ ప్రాంతంలో శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా ఉందని, చెత్త తొలగింపు సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదు చేశారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత మున్సిపల్ మరియు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

నల్లచెరువుకు చెందిన ఖాదర్ బీ అనే మహిళ గత నాలుగేళ్లుగా తన పెన్షన్ నిలిచిపోయిందని, పునరుద్ధరించి మంజూరు చేయాలని కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిశీలించి అర్హత మేరకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ విధిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# గుంటూరు నగరంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

- 3941 విద్యుత్ సర్వీసుల పరిశీలన
- రూ.21.07 లక్షల అపరాధ రుసుం విధింపు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పర్యవేక్షక ఇంజనీర్ సీహెచ్. రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం డీ7-గుంటూరు సెక్షన్ పరిధిలోని గుంటూరు, గోరంట్ల, జొన్నలగడ్డ, రెడ్డిపాలెం ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీల్లో 52 మంది అధికారులు, 156 మంది సిబ్బంది మొత్తం 52 బృందాలుగా ఏర్పడి 3941 విద్యుత్ సర్వీసులను పరిశీలించారు. తనిఖీల్లో విద్యుత్ నిబంధనలు ఉల్లంఘించిన వినియోగదారులపై చర్యలు తీసుకుని మొత్తం రూ.21.07 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీపీఈ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ పీహెచ్. ఖాన్ తెలిపారు.

తనిఖీల్లో మీటర్ ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరికి రూ.50 వేల జరిమానా, అనుమతించిన కేటగిరీకి భిన్నంగా విద్యుత్ వినియోగించిన ఆరుగురికి రూ.50 వేల జరిమానా విధించారు.

అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 361 మందిని గుర్తించి రూ.20.02 లక్షల అపరాధ రుసుం విధించారు. వాస్తవ వినియోగానికి తక్కువగా బిల్లు జారీ అయిన ఒక సర్వీసును గుర్తించి రూ.5 వేల జరిమానా విధించారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం ప్రకారం నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. సీలు లేకపోయినా, దెబ్బతిన్నా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. సాగర తీర ప్రాంతాల్లోని మీటర్ల సీల్స్ త్వరగా దెబ్బతినే అవకాశం ఉన్నందున వినియోగదారులు తరచూ పరిశీలించుకోవాలని తెలిపారు. తనిఖీల సమయంలో సీలు లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా తొలగించడం, మీటర్లకు నష్టం కలిగించడం వంటి అంశాలు గుర్తిస్తే విద్యుత్ చౌర్యంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటర్ ద్వారా విద్యుత్ వినియోగించడం, అనుమతించిన మీటర్ స్థానంలో వేరే మీటర్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు విద్యుత్ చౌర్యంగా పరిగణించబడతాయని తెలిపారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ విధానం ద్వారా జరిమానా చెల్లిస్తే కేసు నుంచి మినహాయింపు ఉంటుందని, రెండోసారి తప్పిదానికి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా ఆస్తుల జప్తు చేసే అవకాశం ఉందన్నారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, దీనిపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. ఫిర్యాదులను 9440812263, 9440812361 నంబర్లకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు.

ఈ తనిఖీల్లో ఆపరేషన్ విభాగ డీఈఈ ఎన్. గురవయ్య, విజిలెన్స్ డీఈఈలు ఎన్. మల్లికార్జున ప్రసాద్, కె. రవికుమార్, ఏఈలు, ఏఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' మూడో వారానికి శ్రీకారం

- పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అవసరం: కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** "పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ మన అందరి బాధ్యత" అనే నినాదంతో గుంటూరు నగరంలో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం మూడో వారంలోకి ప్రవేశించిందని నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 8 నుంచి 13 వరకు నిర్వహిస్తున్న మూడో వారపు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

ప్రజలు ఇళ్ల నుంచి, వ్యాపార సంస్థల నుంచి వెలువడే వ్యర్థాలను తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలుగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. వ్యర్థాల విభజన మూలస్థాయిలోనే జరిగితే నగర పారిశుధ్య నిర్వహణ మరింత సులభమవుతుందని పేర్కొన్నారు.

హోటళ్లు, కళాశాలలు, విద్యాసంస్థలు, పెద్ద అపార్ట్‌మెంట్లు తప్పనిసరిగా బల్క్ వేస్ట్ జనరేటర్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఎక్కువ మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు తమ ప్రాంగణాల్లో చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటి వ్యర్థాల సేకరణ, బల్క్ వేస్ట్ జనరేటర్ల నిబంధనల అమలు, వాణిజ్య ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అధికారులు పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రధాన మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నామని, వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిబంధనలు పాటించని బల్క్ జనరేటర్లకు నోటీసులు జారీ చేసి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, చికెన్, మటన్, చేపల మార్కెట్లలో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సెకండరీ కలెక్షన్ పాయింట్ల వద్ద తక్షణ శుభ్రత చర్యలు చేపడతామని, చెత్త రవాణా వాహనాల నిర్వహణను పర్యవేక్షిస్తామని చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, వ్యర్థాలను కాల్చడం వంటి చర్యలకు పాల్పడేవారిపై జరిమానాలు విధించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని కమిషనర్ తెలిపారు.

నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంఘాలు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల నివారణకు సహకరించవచ్చని, స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## యోగా వేదికను పరిశీలించిన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన నిర్వహించనున్న యోగ వేడుకల ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి వీర పాండియన్, జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రెటరీ రోణంకి గోపాల కృష్ణ పరిశీలించారు. వెస్ట్రన్ బైపాస్ లో తుళ్ళూరు మండలం దొండపాడు వద్ద వేదికను పరిశీలించారు. యోగాలో పాల్గొనే అభ్యర్థులు వచ్చే మార్గాలు వారి వాహనాలకు పార్కింగ్ సౌకర్యంతో పాటు తాగునీరు మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నందున అందుకు గల ఏర్పాటును కూడా చర్చించారు. యోగ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయుటకు అధికారి యంత్రాంగం సమాయాత్తం అయింది.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి వీర పాండియన్ మాట్లాడుతూ ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. 25 వేల మందితో యోగా కార్యక్రమం చేస్తున్న చేయడం జరుగుతుందని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ యోగాంధ్ర 2026 కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వెస్టర్న్ బైపాస్ పై యోగా ఆంధ్ర కార్యక్రమం జూన్ 21న జరుగుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరులో 'యోగాంధ్ర 2026' కార్యక్రమాలు వేగవంతం



- 3518 మంది ట్రైనర్లకు శిక్షణ.. 1849 కేంద్రాల గుర్తింపు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** నగర ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర 2026' కార్యక్రమాలను గుంటూరు నగరంలో వేగవంతం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా యోగా రంగంలో నిపుణులైన మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఒక్కో సచివాలయానికి 17 మంది చొప్పున మొత్తం 3518 మంది శిక్షకులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణ పొందిన ట్రైనర్లు సచివాలయాల పరిధిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ యోగాపై అవగాహన కల్పించేందుకు నగరవ్యాప్తంగా 1849 కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు.

ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేస్తూ యోగాంధ్ర పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. యోగాసనాల పోటీలతో పాటు యోగా ప్రాముఖ్యతను తెలియజేసే చిత్రలేఖనం, నినాదాలు రాయడం, పాటల పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఇప్పటికే 912 మంది పాల్గొన్నారని వెల్లడించారు. యోగాంధ్ర లక్ష్యాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు నగరవ్యాప్తంగా పౌరుల నమోదు ప్రక్రియను వేగంగా కొనసాగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. గుంటూరు నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు యోగాంధ్ర 2026 కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొని నగరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు కార్యక్రమాలపై అవగాహన కల్పించి యోగాంధ్రను విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు యంత్రాంగం చర్యలు తీసుకోవాలి

- జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్ , జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్
- హెల్మెట్ ధరించడం అనేది ప్రతి ఒక్కరు బాధ్యతగా అలవరుచుకోవాలి



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రాబోయే రోజులలో 25 శాతం మేర ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్.వి ఐఏఎస్, జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ లు సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవలసిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఇతర ప్రధాన రహదారులపైనే వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉందన్నారు. హైవేలపై ఉన్న దాబాలు, హోటళ్లు, ఇతర వాణిజ్య కేంద్రాల వద్ద వాహనాలను ఇష్టానుసారంగా రహదారులపై పార్కింగ్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే హైవేల పక్కన ఏర్పాటు చేసుకున్న తోపుడబండ్లతో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ రహదారులపై టోల్ ప్లాజాలు, పెట్రోల్ బంకులు, ఇతర కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫీడ్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్లు, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ లకు అనుసంధానం చేయాలని హైవే, టోల్ ప్లాజా, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. దీనివల్ల ట్రాఫిక్ పర్యవేక్షణతో పాటు ప్రమాదాల నివారణకు మరింత సహకారం అందుతుందని పేర్కొన్నారు.

జిల్లాలోని జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి మార్గాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగిన 20 బ్లాక్ స్పాట్లను, అదేవిధంగా ప్రమాదాలు జరగడానికి అధిక అవకాశాలు ఉన్న 78 ప్రమాదకర ప్రదేశాలను గుర్తించడం జరిగిందన్నారు. మొత్తం 98 ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు స్పీడ్ బ్రేకర్స్, జీబ్రా క్రాసింగ్ లైన్స్, లైటింగ్, బ్లీచింగ్ లైట్స్, వాటర్ బార్గెట్స్ ఇతర అవసరమైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన "శిరోరక్ష - - ప్రాణరక్ష" కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెరిగిందన్నారు. ప్రస్తుతం హెల్మెట్ ధరించే వారి శాతం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వలన ప్రజలలో కూడా చైతన్యం పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం అనేది స్వతహాగా బాధ్యతగా అలవరుచుకోవాలన్నారు.

జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలో ఉన్న ప్రతి విభాగంలోని అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించి 25 శాతం మేర రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరి సహకారంతో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం శిరోరక్ష ప్రాణరక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్.వి ఐఏఎస్ తెలిపారు. ప్రతి ఒక్కరు ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద భద్రత చర్యలను వేగవంతంగా పూర్తి చెయ్యాలిన్నారు. ప్రతి ఒక్క అధికారి చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ వేగవంతంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఏం.హాసిని, సిసిఎస్, రేపల్లె, బాపట్ల, చీరాల డిఎస్పి లు పి.జగదీష్ నాయక్, ఏ.శ్రీనివాసరావు, సిహెచ్.చంద్రమౌళి, ఎండి.మోయిన్, బాపట్ల జిల్లా రవాణా శాఖ, ఆర్.టి.సి, ఆర్ అండ్ బి, హైవే, పంచాయతీ అధికారులు, ఆర్.డి.ఓ లు, ఇతర సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

- పాఠశాలల్లో ఖాళీ పోస్టులను అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లతో భర్తీ చేయాలి
- ఆర్.జే.యు.పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించడం ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్.జే.యు.పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరగకపోవడం, డీఎస్సీ ప్రక్రియ ఆలస్యం కావడం, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో పాఠశాలల్లో ఖాళీల సంఖ్య పెరిగిందన్నారు. దీనివల్ల విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.

ముఖ్యంగా పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో వాటిని తప్పనిసరిగా భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో ఉదయం అసెంబ్లీ నిర్వహణ, విద్యార్థుల క్రమశిక్షణ, క్రీడల నిర్వహణలో పీఈటీల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా లేదా అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించడం ద్వారా పాఠశాలలు ప్రారంభమైన వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అలాగే గత సంవత్సరం బదిలీ అయినప్పటికీ ఇంకా రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్.ఎం. షరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి



- ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులందరూ టెట్ అర్హత సాధించాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటికే 30 సంవత్సరాలకు పైగా సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయడం కష్టతరంగా మారిందని, దీంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక టెట్ నిర్వహణకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలు ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహణకు నోటిఫికేషన్లు విడుదల చేశాయని పేర్కొన్నారు.

2028 ఆగస్టు 31వ తేదీ వరకు ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించేందుకు అవకాశం కల్పించినట్లు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నట్లు ఒంటేరు తెలిపారు. ప్రస్తుతం జనరల్ టెట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రత్యేక టెట్ నిర్వహిస్తారా లేదా అనే ఆందోళన ఉపాధ్యాయుల్లో నెలకొందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ అధికారులు వెంటనే ప్రత్యేక టెట్ నిర్వహణకు చర్యలు చేపట్టి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి కోరారు.

## 392 కొత్త వైద్యుల పోస్టింగుల కోసం వెబ్ కౌన్సెలింగ్!

- పారదర్శకత చర్యల్లో భాగంగా తొలిసారిగా అమలు
- 20వ తేదీలోగా విధుల్లో చేరేలా 12న పోస్టింగు ఉత్తర్వులు
- ఎన్. హెచ్. ఎం.నోటిఫికేషన్ ద్వారా నియామకాలు
- రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్. హెచ్. ఎం.) కింద ఎంపిక చేసిన వైద్యులకు తొలిసారిగా వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు ఇస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. పారదర్శక చర్యల్లో భాగంగా ప్రజారోగ్య శాఖలో తొలిసారిగా ప్రవేశపెట్టిన వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని ఎన్. హెచ్. ఎంలోనూ అనుసరిస్తున్నామని చెప్పారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు జారీచేసి, మెరిట్ ప్రతిపాదికన ఒప్పంద విధానంలో ఎంబీబీఎస్ అర్హతతో ఎంపికచేసిన 392 మెడికల్ ఆఫీసర్లకు త్వరలో పోస్టింగులు ఇవ్వబోతున్నామని వెల్లడించారు. ఒకే అర్హతతో ఆరు కేటగిరి పోస్టులకు ఎంపికచేసిన వైద్యుల జాబితా అనుసరించి ఈ పోస్టింగులు ఇస్తున్నామని నేడొక ప్రకటనలో మంత్రి సత్యకుమార్ వివరించారు.

**6 కేటగిరిల్లో కలిపి 392 పోస్టులు**

ఈ 392 పోస్టుల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 173, సీహెచ్సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ఎన్సీడీ క్లినిక్ నిర్వహణ అవసరాల కోసం 99 పోస్టులు కేటాయించారు. నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల అవసరాలకు 70, న్యూట్రిషన్ రిహాబిలేషన్ సెంటర్ల కోసం 12, టెలీ మెడిసిన్ హబ్స్ అవసరాల కోసం 25, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ల కోసం 13 చొప్పున కలిపి 392 పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇంతకుముందు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కౌన్సెలింగ్ జరిగేది. ఈ విధానంలో ఖాళీలు చూపిస్తే అభ్యర్థులు పోస్టింగ్ స్థానాలు ఎంపిక చేసుకునే వారు. ఈ విధానంలో సాంకేతికపరమైన సమస్యలు, స్థానాల ఎంపికలో అభ్యర్థులు కాస్త ఇబ్బందులు పడేవారు ఈ సమస్యలకు వెబ్ కౌన్సెలింగ్ ఫుల్ స్టాప్ పెడుతుంది. 6 కేటగిరిల కింద చూపించిన స్థానాల అన్నింటికీ అభ్యర్థులు అప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు వెబ్ కౌన్సెలింగ్లో ఉంది అప్షన్ల నమోదుకు అనుగుణంగా పోస్టింగు స్థానాలు దక్కుతాయి. ఈ విధానంలో మానవ జోక్యం ఉండదు.

ఇందుకు అనుగుణంగా జాతీయ ఆరోగ్య మిషన్ ప్రవేశపెట్టిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రారంభమైన అప్షన్ల నమోదు గడువు బుధవారంతో ముగియనుంది. పోస్టింగు ఉత్తర్వులు శుక్రవారం లేదా శనివారం అభ్యర్థులకు ఆటోమేటిగ్గా జారీ జరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషన్, జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్ జి వీరపాండియన్ వెల్లడించారు. పోస్టింగు ఉత్తర్వులు పొందిన వారు ఈ నెల 20వ తేదీలోగా విధుల్లో చేరాలని స్పష్టంచేశారు.

## వీఐటీ-ఏపీలో తొలి అమరావతి ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ విజయవంతం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి అమరావతి ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. జూన్ 1 నుంచి 8 వరకు జరిగిన ఈ ఎనిమిది రోజుల టోర్నమెంట్కు దేశ, విదేశాల నుంచి చెస్ క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది.

టోర్నమెంట్లో మొత్తం 943 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారు 21 రాష్ట్రాలు, 2 దేశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఇందులో 669 మంది అంతర్జాతీయ రేటింగ్ కలిగిన ఆటగాళ్లు, 76 మంది టైటిల్ హోల్డర్లు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్లు, కాండిడేట్ మాస్టర్లు, ఫిడే మాస్టర్లు వంటి ప్రతిభావంతులైన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారుల నుంచి అనుభవజ్ఞులైన చెస్ క్రీడాకారుల వరకు అన్ని వయసుల వారు ఈ టోర్నమెంట్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ విభాగాల్లో విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. మొత్తం రూ. 30 లక్షల నగదు బహుమతులను ప్రదానం చేశారు.

టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీజీపీ, హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ హరీష్ కుమార్ గుప్తా, ఐజీ యాంటీ నార్కోటిక్స్ సెల్ ఆకే రవి కృష్ణ, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ హాజరయ్యారు. టోర్నమెంట్ను క్రీడలు, యువజన వ్యవహారాలు, రవాణా శాఖ మంత్రి ఎం. రామ్ ప్రసాద్ రెడ్డి, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు, బీసీ సంక్షేమం, చేనేత, వస్త్ర శాఖ మంత్రి ఎస్. సవిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులు సందర్శించి క్రీడాకారులను ప్రోత్సహించారు.

ముగింపు కార్యక్రమంలో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి. అరుళ్మొళి వర్మన్ మాట్లాడుతూ తొలి అమరావతి ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్కు లభించిన స్పందన ఆనందాన్ని కలిగించిందన్నారు. దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొనడం ద్వారా విద్య, క్రీడలు, సమగ్ర అభివృద్ధిలో వీఐటీ-ఏపీ ప్రాధాన్యతను చాటిందన్నారు.

వీఐటీ-ఏపీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర మాట్లాడుతూ భారీ స్థాయిలో టోర్నమెంట్ విజయవంతం కావడం నిర్వహణ కమిటీలు, వాలంటీర్లు, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమన్నారు.

ఆంధ్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ కె.వి.వి. శర్మ మాట్లాడుతూ అమరావతి ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆంధ్రప్రదేశ్లో చెస్ పోటీలకు కొత్త ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. అమరావతిని చెస్ కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి చెస్ క్రీడకు పెరుగుతున్న ఆదరణకు ఈ టోర్నమెంట్ నిదర్శనమన్నారు. అన్ని వయసుల క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వీఐటీ-ఏపీ డిప్యూటీ డైరెక్టర్ (స్టూడెంట్ వెల్ఫేర్) డాక్టర్ ఖదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. రామచంద్రరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎంలో మెగా ప్లాంటేషన్ ప్రోగ్రామ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ సమతుల్యత కోసం పచ్చదనం ఎంతో అవసరమని భావించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎన్ సీసీ విద్యార్థుల సహకారంతో సోమ, మంగళవారాల్లో వర్సిటీ ప్రాంగణంలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటించింది. యూనివర్సిటీ స్టూడెంట్స్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్లాంటేషన్ ప్రోగ్రామ్ ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. యూనివర్సిటీ బస్ యార్డు ప్రాంగణంలోని విశాలమైన స్థలంలో ఎన్సీసీ విద్యార్థులు వివిధ రకాల నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల జాతి మొక్కలను పెద్ద ఎత్తున నాటారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక చెట్టు) నినాదంతో విద్యార్థులంతా ఉత్సాహంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. నాటిన మొక్కలన్నింటినీ జాగ్రత్తగా పెంచాలనీ, క్రమం తప్పకుండా రోజూ నీళ్లుపోసి మొక్కలను కాపాడాలని రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ విద్యార్థులకు సూచించారు. ఈ తరహా ప్లాంటేషన్ ప్రోగ్రామ్ను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని విద్యార్థి వ్యవహారాల విభాగం ఇన్చార్జి డైరెక్టర్ రేవతీ బాలక్రిష్ణన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ వి.క్రేజీ కౌల్, విద్యార్థుల క్రమశిక్షణ, వసతి గృహాల సమన్వయ డైరెక్టర్ మేజర్ జనరల్ గురుదీప్ సింగ్, 22 ఎన్సీసీ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ ఉదయ కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ మహేశ్, యూనివర్సిటీ ఎన్సీసీ ఆఫీసర్ హరినాగేంద్ర, వివిధ స్కూళ్ల నుంచి విచ్చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం అమలులో ఉన్న టెట్ సిలబస్లో ఉపాధ్యాయుల బోధనా విధానానికి సంబంధం లేని అంశాలు ఉండటంతో, సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించి, వారు బోధించే సబ్జెక్టుకు అనుగుణంగా మాత్రమే సిలబస్ రూపొందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షను ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని, అందరికీ ఒకే విధమైన కనీస అర్హత మార్కులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక టెట్ను సంవత్సరానికి రెండు సార్లు నిర్వహించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా దీర్ఘకాలంగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహణకు అవకాశం కల్పిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు లేఖ రాసినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు తెలిపారు.

# పరివర్తనాత్మక పాలనలో 12 ఏళ్లు : మోదీ నాయకత్వం

- మరియు 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆంధ్రప్రదేశ్ పురోగతిని ఎలా వేగవంతం చేస్తున్నాయి
- ఎన్. మధుకర్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఆంధ్రప్రదేశ్
- భారత అభివృద్ధి ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం

గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం పన్నెండు ఏళ్ల పరివర్తనాత్మక ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటున్న తరుణంలో, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించే దిశగా కీలక ఘట్టంలో నిలిచింది. గత దశాబ్ద కాలంలో, మౌలిక సదుపాయాలు, సంక్షేమం, ఆర్థిక వృద్ధి, డిజిటల్ పరివర్తన, జాతీయ భద్రత మరియు ప్రపంచ స్థాయి నాయకత్వం వంటి రంగాలలో భారతదేశం అపూర్వమైన పురోగతిని సాధించింది.

పేదలకు గౌరవాన్ని కల్పించడం మరియు మహిళా సాధికారత నుండి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నిర్మాణం మరియు యువతకు కొత్త అవకాశాలను సృష్టించడం వరకు... మోదీ ప్రభుత్వం అభివృద్ధి, పారదర్శకత మరియు ప్రభుత్వ ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటం (లాస్ట్-మైల్ డెలివరీ) అనే సూత్రాల ద్వారా పాలనను పునర్నిర్వచించింది.

ఆంధ్రప్రదేశ్కు ఈ పన్నెండు ఏళ్లు ఎంతో కీలకమైనవి. నిరంతర ఆర్థిక మద్దతు, భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక అభివృద్ధి మరియు సంస్థాగత నిర్మాణాల ద్వారా రాష్ట్ర అభివృద్ధి గమనాన్ని తీర్చిదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. నేడు, కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు (ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మద్దతుతో) నాయకత్వంలోని 'డబుల్ ఇంజిన్ సర్కార్' సారథ్యంలో, ఆంధ్రప్రదేశ్ వేగవంతమైన అభివృద్ధి మరియు నూతన ఆశావాదంతో కూడిన కొత్త శకంలోకి అడుగుపెడుతోంది.

**ఆంధ్రప్రదేశ్కు అపూర్వమైన ఆర్థిక మద్దతు**

కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్కు అందించిన ఆర్థిక మద్దతు స్థాయి, రాష్ట్ర అభివృద్ధి పట్ల దానికున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

2004 మరియు 2014 మధ్య, అవిభక్త ఆంధ్రప్రదేశ్ కేంద్ర పన్నుల వాటాగా రూ. 1.32 లక్షల కోట్లను పొందింది. 2014 మరియు 2027 మధ్య ఈ మొత్తం రూ. 4.05 లక్షల కోట్లకు పైగా పెరిగింది – ఇది 206 శాతానికి పైగా వృద్ధిని సూచిస్తుంది. అదేవిధంగా, భారత ప్రభుత్వం నుండి అందిన గ్రాంట్లు (Grants-in-Aid) 2004-14 కాలంలో రూ. 78,112 కోట్ల నుండి 2014-27 కాలంలో రూ. 3.32 లక్షల కోట్లకు పైగా పెరిగాయి – ఇది 325 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఇలా పెరిగిన నిధుల బదిలీలు, అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడంలో మరియు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర సామర్థ్యాన్ని బలోపేతం చేశాయి.

**మౌలిక సదుపాయాలు: అభివృద్ధికి పునాది**

ఆర్థిక పరివర్తనకు మౌలిక సదుపాయాల అభివృద్ధియే కీలకమని మోదీ ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోంది.

ఆంధ్రప్రదేశ్లో జాతీయ రహదారుల పొడవు 2014లో సుమారు 4,193 కిలోమీటర్ల నుండి నేడు 8,700 కిలోమీటర్లకు పైగా పెరిగింది. బెంగళూరు--కడప--విజయవాడ ఎక్స్ప్రెస్వే, విశాఖపట్నం--రాయ్పూర్ ఎకనామిక్ కారిడార్, హైదరాబాద్--విశాఖపట్నం కారిడార్, ఇంకా పలు భారత్మాల ప్రాజెక్టుల వంటి ప్రధాన ప్రాజెక్టులు రాష్ట్రవ్యాప్తంగా అనుసంధానాన్ని రూపుమాపుతున్నాయి. భారత్మాల మొదటి దశ కింద రూ. 71,842 కోట్లకు పైగా విలువైన హైవే ప్రాజెక్టులకు ఆమోదం లభించింది.

విమానయాన రంగంలో, భోగాపురం, దగదర్తి, ఓర్వకల్లలో గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయాలకు ఆమోదం లభించింది. తిరుపతి, విజయవాడ విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా ఉన్నతీకరించగా, విశాఖపట్నం, రాజమండ్రి, కడప, విజయవాడ విమానాశ్రయాలను గణనీయమైన పెట్టుబడులతో ఆధునీకరించారు.

**రైల్వే విప్లవం మరియు దక్షిణ కోస్తా రైల్వే జోన్**


విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలన్న చిరకాల డిమాండ్ను నెరవేర్చడం ఆంధ్రప్రదేశ్కు చారిత్రాత్మక విజయాలలో ఒకటిగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్కు రైల్వే బడ్జెట్ కేటాయింపులు 2009-14 మధ్య వార్షిక సగటున రూ. 886 కోట్ల నుండి 2026 నాటికి రూ. 10,134 కోట్లకు పైగా పెరిగాయి. ప్రస్తుతం రూ. 73,743 కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 100 శాతం రైల్వే విద్యుదీకరణను సాధించగా, రైల్వే డబ్లింగ్, కొత్త లైన్ ప్రాజెక్టులు, ఫ్లైఓవర్లు, స్టేషన్ల పునరాభివృద్ధి పనులు వేగంగా పురోగమిస్తున్నాయి.

అన్నింటికంటే ముఖ్యంగా, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభించి, ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్షను నెరవేర్చింది. ఈ మైలురాయి విజయం రైల్వే లాజిస్టిక్స్ను బలోపేతం చేస్తుంది, కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది మరియు ఈ ప్రాంతమంతటా ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుంది.

**విస్తృత, పారదర్శక, ప్రభావవంతమైన సంక్షేమం**

మోదీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేశాయి. పీఎంఏవై కింద 21 లక్షలకు పైగా పట్టణ గృహాలు, 2.47 లక్షల గ్రామీణ గృహాలు మంజూరు చేయబడ్డాయి. పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 2.68 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నారు. పీఎం-కిసాన్ ద్వారా 41 లక్షల మందికి పైగా రైతులు ప్రత్యక్ష ఆదాయ మద్దతును పొందుతున్నారు. 1.69 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరవబడ్డాయి, అలాగే ఆయుష్మాన్ భారత్ 1.86 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఆరోగ్య సంరక్షణ భద్రతను కల్పించింది.



జల్ జీవన్ మిషన్ 71 లక్షల గ్రామీణ గృహాలకు కుళాయి నీటి కనెక్షన్లను అందించింది. రూ. 1.36 లక్షల కోట్లకు పైగా విలువైన ముద్రా రుణాలు పారిశ్రామికవేత్తలను మరియు యువతను సాధికారులను చేశాయి, అలాగే 'పీఎం స్వానిధి' రాష్ట్రవ్యాప్తంగా వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయాన్ని అందించింది.

**రైతులు, మహిళలు మరియు గ్రామీణ వర్గాల సాధికారత**

**వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధి**

వ్యవసాయ రంగంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ రైతులకు బహుముఖ ప్రయోజనాలను చేకూర్చాయి. పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు ఆర్థిక సహాయం అందుతోంది. కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ద్వారా సులభతర రుణాలు, పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా పంట బీమా రైతులకు ఆర్థిక భద్రతను కల్పిస్తున్నాయి. అదనంగా, ఇ-నామ్ (వ-చీూవీ) పోర్టల్ ద్వారా రైతులు దేశవ్యాప్తంగా మార్కెట్లకు నేరుగా అనుసంధానమవుతున్నారు, మధ్యవర్తుల పాత్ర తగ్గి రైతులకు మెరుగైన ధరలు లభిస్తున్నాయి.

**మహిళా సాధికారత**

మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతను విధాన కేంద్రంగా నిర్వచించింది. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం ద్వారా బాలికల విద్య మరియు రక్షణకు ప్రాధాన్యమిచ్చారు. ఉజ్వల యోజన కింద లక్షలాది మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించడం వంట పొగ నుండి విముక్తినిచ్చింది. స్వయం సహాయక బృందాలను (ూ౧+౦) బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ూవీ ఆవాస్ యోజన కింద ఇళ్ళ రిజిస్ట్రేషన్ మహిళల పేరిట చేయడం వారి ఆస్తి హక్కులను పటిష్టం చేసింది.

**పారిశ్రామిక అభివృద్ధి మరియు పెట్టుబడులు**

ఆంధ్రప్రదేశ్లో పారిశ్రామిక వాతావరణాన్ని మెరుగుపరచడంలో కేంద్ర-రాష్ట్ర సమన్వయం కీలక పాత్ర పోషిస్తోంది. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ మరియు హైదరాబాద్-వారంగల్ పారిశ్రామిక కారిడార్ వంటి ప్రాజెక్టులు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ మరియు రిన్యువబుల్ ఎనర్జీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకుపోతోంది.

అమరావతి రాజధాని నగర పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు నిధులు – ఇవి రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యమైన రెండు విషయాలు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రాష్ట్రంలో సాగు నీటి విప్లవం చోటు చేసుకోనుంది – లక్షలాది ఎకరాలకు నీరందించడంతో పాటు తాగునీరు మరియు విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుంది.

**డిజిటల్ ఇండియా మరియు టెక్నాలజీ పరివర్తన**

డిజిటల్ ఇండియా మిషన్ ఆంధ్రప్రదేశ్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ ద్వారా గ్రామాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్, సీ.ఎస్.సీ (Common Service Centres) ద్వారా డిజిటల్ సేవలు, యూపీఐ ఆధారిత చెల్లింపులు, డీబీటీ ద్వారా సంక్షేమ నిధుల పారదర్శక బదిలీ – ఇవన్నీ సామాన్యుల జీవితాలను మెరుగుపరిచాయి. భ్రష్టాచారానికి తావు లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేరడం ఈ డిజిటల్ పరివర్తన యొక్క అతిముఖ్యమైన ఫలితం.

**విద్య మరియు నైపుణ్య అభివృద్ధి**

యువత భవిష్యత్తు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం ముందుగా అడుగులు వేసింది. ఆంధ్రప్రదేశ్లో కొత్తఐఐటీ, ఎన్.ఐ.టీ , ఎయిమ్స్, కేంద్రీయ విద్యాలయాలు మరియు నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. పీఎం కౌశల్ వికాస్ యోజన ద్వారా లక్షలాది యువతీ యువకులు నైపుణ్య శిక్షణ పొందారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ యువ పారిశ్రామికవేత్తలు కొత్త వ్యాపారాలు ప్రారంభించే దిశగా ప్రోత్సాహం పొందుతున్నారు.

**పర్యావరణం మరియు పునరుత్పాదక శక్తి**

భవిష్యత్ తరాల కోసం స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలన్న నిబద్ధతతో, మోదీ ప్రభుత్వం రిన్యువబుల్ ఎనర్జీ రంగంలో అభూతపూర్వమైన పురోగతిని సాధించింది. ఆంధ్రప్రదేశ్ సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో అగ్రగాముల్లో ఒకటిగా నిలుస్తోంది. పీఎం కుసుమ్ యోజన కింద రైతులు సోలార్ పంప్సెట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఖర్చు తగ్గించుకుంటున్నారు. గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ భారత్లో ముఖ్యమైన కేంద్రంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి.

**డబుల్ ఇంజిన్ సర్కార్: సహకారానికి నూతన నమూనా**

'డబుల్ ఇంజిన్ సర్కార్' అంటే కేవలం రాజకీయ నినాదం మాత్రమే కాదు – ఇది ప్రజాసంక్షేమం కోసం కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే లక్ష్యంతో, ఒకే దిశలో పనిచేసే ప్రభుత్వ సహకార నమూనా. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన విశేష పరిపాలనా అనుభవంతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువత మరియు సామాన్యుల మనసును అర్థం చేసుకునే శక్తితో – ఇద్దరూ కేంద్రంలో మోదీ ప్రభుత్వంతో కలిసి ఆంధ్రప్రదేశ్ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

ఈ సమన్వయం వల్ల పెండింగ్లో ఉన్న పలు కేంద్ర ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్నాయి. రాష్ట్రానికి రావాల్సిన నిధులు సకాలంలో అందుతున్నాయి. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మద్దతుతో శక్తిమంతంగా ముందుకు సాగుతోంది.

**భవిష్యత్తు దిశ: వికసిత ఆంధ్రప్రదేశ్ ఏ 2047**

విజన్ 2047 సాకారం కావడానికి ఆంధ్రప్రదేశ్ ముందు అనేక అవకాశాలున్నాయి. అమరావతి రాజధాని నగర నిర్మాణం పూర్తికావడంతో రాష్ట్రం పాలనాపరంగా సుస్థిరత సాధిస్తుంది. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి 'జీవనాడి'గా పనిచేస్తుంది. పారిశ్రామిక కారిడార్లు ఉపాధి అవకాశాలను పెంచుతాయి. విద్య, ఆరోగ్యం, టెక్నాలజీ రంగాలలో పెట్టుబడులు మానవ వనరుల అభివృద్ధికి దోహదం చేస్తాయి.

ఒకవైపు మోదీ ప్రభుత్వం కేంద్రస్థాయిలో బలమైన నాయకత్వాన్ని అందిస్తుండగా, మరోవైపు చంద్రబాబు--పవన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తోంది. ఈ సమ్మేళనం 'విజన్ 2047 -- వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్' లక్ష్యసాధనకు బాటలు వేస్తోంది. పరివర్తనాత్మక పాలనలో 12 ఏళ్లు – ఇవి కేవలం సంఖ్యలలో లెక్కించే సంవత్సరాలు కాదు. ఇవి లక్షలాది పేద కుటుంబాలకు ఇళ్లు మిళ్ళిన సంవత్సరాలు, కోట్లాది మందికి ఆహారభద్రత కలిగిన సంవత్సరాలు, రైతుల కన్నీళ్లు తుడిచిన సంవత్సరాలు, మహిళలు సాధికారత పొందిన సంవత్సరాలు, యువత కలలు నెరవేరిన సంవత్సరాలు.

ఆంధ్రప్రదేశ్ విషయంలో ఈ ప్రయాణం ఇంకా పూర్తి కాలేదు – అసలు వేగవంతమైన దశలో అడుగుపెడుతోంది. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు--పవన్ నాయకత్వంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆంధ్రప్రదేశ్ను ప్రగతి పథంలో నడిపించడానికి సంకల్పబద్ధంగా ఉంది. ఈ నాయకత్వంపై, ఈ దిశపై ఆంధ్రప్రదేశ్ ప్రజల విశ్వాసం ఉన్నంతకాలం – రాష్ట్రం తప్పకుండా అభివృద్ధిలో కొత్త శిఖరాలను అందుకుంటుంది.

**జై ఆంధ్రప్రదేశ్! జై భారత్!**

**ఎన్. మధుకర్**

**రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఆంధ్రప్రదేశ్**

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.

Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467